

# పరిపరివిధాల

తెల్లవార వస్తున్నది. ఇంకాబాగా వెల్తురు రేకలు విచ్చుకోలేదు. కలువమొగ్గ రేకులు వదులుతున్నట్టు వెలుగూ చీకటీ కలిసి అందంగా తెల్లవారబోతున్నదని, గాలికి వూగే తామరపూలు పంటకాలవలో తేలియాడుతున్నాయి. పంటకాలువ బాటపక్కన ప్రవహిస్తున్నది. నీటినుండి పైకి వచ్చిన మొగ్గలాగా వున్నది ప్రాతఃకాలం. పిట్టలు యింపుగా కూస్తూ హెచ్చరిస్తున్నాయి.

కూతురు గజలక్ష్మితో గెలవలేక కమలమ్మ, కొద్ది దూరంలోనే వున్న డాక్టర్ దయాసాగర్ని పిలుచుకొచ్చింది.

దయాసాగర్ విడోయరు. పిల్లలున్నారు. చక్కగా డ్రెస్ చేస్తాడు. మోసగించటం యిష్టం లేదు. అమాయకులను మోసగిస్తే నెత్తిఅడుస్తుందని నవ్వుతాడు. ''పిల్లలుగలవాడిని, వారి శ్రేయస్సుకి కష్టపడాలి. భగవంతుడు మెచ్చుద్దా? ఆయన కన్నుగప్పగలమా? సహస్రాక్షి'' ఫిలాసఫర్లాగా అంటాడు.

మధ్యహాలులో చాపమీద కూచుని వున్నది గజలక్ష్మి. డాక్టర్ని చూస్తూనే, ''పిలుచుకొచ్చిందే వైద్యుడిని మమ్మీ. ప్రకృతి పిలిస్తే పొట్ట వుబ్బుతుంటే, దొడ్డి వేపు వెళ్లిందనుకున్నా. యేమని కంప్లెయింట్ చేసిందీ మమ్మీ? పిచ్చెత్తిందన్నదా? స్ట్రెప్పై చేతువుగాని రా అన్నదా? కాస్తకూ్కస్తకే, పిచ్చెత్తింది పిచ్చెత్తిందంటుంది మమ్మీ. నల్లని పీల పెదిమలు, పాచిపళ్ళు, యీావిడ మా నాన్నకెలా ముద్దొచ్చేదో తెలియదు. ఆయనందంగా గూడా త్రికోణాకారం వచ్చేట్టు ముసుగేసుకునేదేమో. గొప్పంటి బిడ్డని ముద్దుచేశాడేమో. పుట్టింటి గొప్పాలేదు

కొరివీ లేదు డాక్టర్! అంతా మిథ్య. ఉన్నదల్లా జెలసీ, యిగో. వాళ్ల నాన్నకీ అదే. మా తాతగారు భూమయ్య గారు. కూచోండి. నిలబడే వున్నారు. కుర్చీలేదు. ఒక కాలు విరిగింది కుర్చీకి. మీరు పడిపోవచ్చు'' తాను చివరికి జరిగి చేతితో చోటు చూపింది గజలక్ష్మి.

డాక్టరు నొచ్చుకోకుండా, సందేహించకుండా చాపమీద కూచున్నాడు. వైద్య పరికరం మెడిసిన్ ఛెస్టూ అవతలగా వుంచాడు.

''అసలలా యెందుకంటున్నావు'' అని మీ మమ్మీనే అడగలేదూ?'' అనడిగాడు సింపతీ వినిపించింది. రక్తపోటు చూసే పరికరం ఆర్డర్లో పెట్టుతున్నాడు. దాన్ని చూస్తూ పకాపక నవ్వింది, గజలక్ష్మి జాపివున్న కాలిబొటనవేలు పట్టుకుని గిర్రున తిరిగి మళ్లా సరిగా కూచున్నది.

''అర్ధరాత్రి మెలకువ వచ్చింది డాక్టర్. చాలా ఆకలేసింది. మమ్మీని లేపితే 'యేం కావాలన్నది' శోష వస్తున్నది. కళ్లు తిరుగుతున్నాయి. నిన్న ఏకాదశి ఒక్క పొద్దున్న గదూ. విధవరాలినైపాయె. నేల శయనమైపాయె. మెత్తని పరుపూ లేదు. చాపనిండా నల్లులూ'' అంటుంటే ''యేం చేయమంటా?'' అనడిగింది అమాయకత నటిస్తూ. మమ్మీకి తెలిసే అడుగుతుంది. అదొక ట్రిక్. ''అన్నం వండి, కంది పచ్చడిచేసి యింగువ చారూ, అప్పడం, వడియం వేసి అన్నం పెట్టు. చల్లక్కర్లేదు. కూరా పిండివంటలూ, పరమాన్నం అక్కర్లేదు. అవన్నీ చేసేప్పటికి తెల్లారుతుంది'' అన్నాను డాక్టర్. చెప్పినపని చేయకపోగా రెండు పూరీలు తెచ్చి, ''మంచి నీళ్లు తాగి పడుకో'' అన్నది మమ్మీ. మంచి ఆకలి మీద వుండి తింటే, చీమలుండి నోరంతా కుట్టినై. చీమలు పట్టిన పూరీలిచ్చావని అరిస్తే, ''తేనె నాకు, తేనె నాకు'' అని పళ్లెంలో తేనెపోసి యిచ్చింది మమ్మీ. ఆవిడ మొహం మీద ఆ

పళ్లెం రుద్దాను అంతే. ''పిచ్చెత్తింది. పిచ్చెత్తింది'' అని వీధినబడి పరుగెత్తి మిమ్మల్ని తెచ్చింది మమ్మీ'' అని మళ్లా నవ్వింది.

''తెల్లారిందిగా డాక్టర్. అన్నం తినచ్చా. మొహం కడుక్కోవాలా?'' అనడిగింది. నవ్వితే తెల్లగా మెరిసే పళ్లు రంగుమారి కనిపించాయి.

డాక్టర్ నిదానంగా, మర్యాదగా, పూరడింపుగా మాట్లాడుతూ బిపి చూశాడు. ఇంజెక్షనిచ్చాడు. అన్నీ సద్దేశాడు.

ఆయన్నే చూస్తూ అడిగింది ''మీరు రెండో పెళ్లి చేసుకున్నారని చెప్పుకుంటున్నారే డాక్టర్! పిల్లలకి సవిత్తల్లి తయారైందా? వండి వార్చలేకనేనా ఆ పనిచేశారు? తిప్పులాడి మిమ్మల్ని లొంగదీసిందా? మోహించానని పెళ్లాడిందా? అంతగా పిల్లల్ని సాకలేకపోతే డాక్టర్ నాకు కబురంపితే నేను వచ్చి సాకేదాన్ని. నాకు గుడ్‌కుక్ అని డిగ్రీ వున్నది. జీతమడుగుతానని వెరిచారేమో. మీ పిల్లలు నా స్టూడెంట్సే''. కళ్లు బరువెక్కి చాప మీది కొరిగింది గజలక్ష్మి. కలవరిస్తున్నట్లున్నది. ''నేను విడోయరు మీరు విడోయర్. మనం వివాహమాడితే వుద్యోగం వెలిగిస్తున్నాను కదా. జీతం తెచ్చి మీ చేతులో పోసేదాన్ని. డాక్టర్ అదన్నా చూశారు గాదు'' అని నిద్రలో కొరిగింది గజలక్ష్మి.

''యేమిటంటారు?'' కమలమ్మ డాక్టరు వంక చూసింది.

''అమ్మాయికి మతి చలించింది. అది వంశంలో వుండి వచ్చిన చాంచల్యమైతే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముదరచ్చు. రెచ్చగొట్టరాదు. ఆమె మానాన ఆమె నుండనివ్వాలి. కవ్వించారంటే రెచ్చిపోతుంది. ఘాటు పదార్థాలు, నిలవ పదార్థాలు, కాఫీ వంటివి మాన్పించాలి. సినిమా చూడరాదు. మందులు

రాసిస్తాను. తగ్గినట్టు కనిపించినా మందులాపరాదు. మెడిటేషన్ సెంటర్‌కి పంపండి. మెగా క్లాసెస్‌కి అటెండయితే యింకా మెరుగు. కంట్రోల్ చేయచ్చు. రెగ్యులర్ అలవాట్లు చేయాలి'' అని లేచాడు డాక్టర్. కమలమ్మా లేచి నిలబడింది.

''చాల కష్టాలూ అవమానాలకీ తట్టుకున్నదండీ. మంచి ఆలోచనలే చేసింది. భరించింది. శాంతంగా వుండేది. ఇప్పుడెందుకొచ్చిందీ చాంచల్యం?''

''అలా భరించింది గనకనే యిపుడు నర్వస్ బ్రేక్ డౌన్ వచ్చింది. మెదడుకి మంచివార్తలందించే నరాలు దెబ్బతిన్నాయి. అందుకే భద్రతలు తీసుకోమని చెప్తున్నా''.

'సంబంధాలొస్తే తిప్పి కొట్టింది. చేసుకుంటే బావుండేది. భర్త కనిబెట్టి చూసేవాడు. నా ఒక్కత్తెవల్లా ఔతుందా?''

'' ఆమె అభిరుచికి నచ్చినవాడు రాలేదేమో. లేదా యేదో పెద్ద ఆశకు లోనై వుండాలి. యేమైనా చుట్టూ వున్నవాళ్లు భద్రతలు తీసుకోవాలి. లేకపోతే పనికి రాకుండా అలివి గాకుండా పోతుంది. ఇంకప్పుడేమి చేసినా అనుకున్నా లాభించదు''. దయాసాగర్ వెళ్లిపోతుంటే అటే చూసింది కమలమ్మ.

''అంత గొప్పదా!'' అని గొణిగి కల్లాపికి వెళ్లింది.

2

మానసిక వ్యాధుల మీద రీసెర్చి చేసిన డాక్టర్లు సెమినార్ పెట్టుకున్నారు. ఫ్రెండ్స్‌కీ, గౌరవనీయులకీ, బ్రెయిన్ సర్జన్స్‌కీ గూడా ఆహ్వానాలు పంపారు. కొత్త థెరపీలు, కొత్త ఔషదాలు వాడి మంచి ఫలితాలు వస్తున్నాయనే వారినీ

ఆహ్వానించారు. మ్యూజిక్ థెరపీ, దేశాటన థెరపీలు అప్లైచేసిన వైద్యులనూ ఆహ్వానించారు. రానూ పోనూ ఖర్చులు, లంచ్, డిన్నర్, లాడ్జింగ్, సైట్ సీయింగ్ వుంటాయని ఆకర్షవంతంగా ఆహ్వానాలందాయి. ఒకరు చెప్పేది మరొకడు విని తెలుసుకోవచ్చు. తామూ అప్లై చేయచ్చు. ఫిల్మ్ గూడా చూపుతారు.

మధ్యాహ్నం లంచ్ ముగిసింది. విశ్రాంతి. మళ్లా సెమినార్ మొదలు. సాయంకాలమైంది. చివరి వరసలో వున్నవారు మెల్లిగా మాట్లాడుకోసాగారు.

''దయాసాగర్! నీ పేషంటు గజలక్ష్మి జాబ్‌కి తిలోదకాలిచ్చిందని అంటున్నారే. మంచి జాబ్. మంచి జీతం. కొలీగ్స్ దయగా గౌరవంగా చూస్తూ సహకరిస్తారే. దేనికొదిలేసిందో తల్లికైనా తెలిసివుండాలి. నాకు కష్టం వేసింది. మంచి అమ్మాయి. అభివృద్ధిలోకి రావాలనీ, కుటుంబానికి సాయపడాలనే ఆశయాలు గల అమ్మాయి పరీక్ష నెగ్గిందా? గట్టెక్కలేదని హర్ట్ అయిందా? ఈజీ సబ్జక్ట్సు ప్రిపేర్ కావటానికి తగినంత టైం లేకపోతే పార్ట్ బై పార్ట్ అప్పియర్ కావచ్చునే'' అనడిగాడు పినాకి.

''నాకు వివరాలు తెలియవు. వాళ్ల మమ్మీ నన్ను మళ్లా కన్సల్టు చేయలేదు. గజలక్ష్మి రాలేదు. విజన్ బాగా లేదని ఐ స్పెషలిస్టుని, రూటస్‌ని కన్సల్ట్ చేసిందట. రూటస్ మళయాళీ, మలబార్ నించి వచ్చాడు. ప్రైవేట్ హాస్పిటల్లో పని. ఆంధ్రాకి వచ్చి చాలా యేళ్లయింది. క్రిస్టియన్ అయినా దయగలవాడు. మతభేదం పాటించడు. మంచి రాబడి వున్నది. వాళ్లబ్బాయికి హెల్త్ సర్టిఫికేట్ కావాలని వచ్చాడు. అడిగాడు ''గజలక్ష్మి అనే ఆమెకి మైండ్ ఎఫెక్ట్ అయిందా డాక్టర్! మర్యాదగా తెలివిగా మాట్లాడుతూనే అంతలోనే మతిబోయినట్టు మాట్లాడుతూ బిహేవ్ చేస్తుంది. నేను పట్టించుకోనూ లేదు, గమనించనూ లేదుగానీ కంపౌండర్

అజీజ్, నర్స్ సాల్మన్ కంప్లెయింట్ చేశారు. తనకివ్వాల్సినంత గౌరవమివ్వలేదుట. యెంతేమిటి జీతం?'' అన్నదిట. పొగరుమోత్తనమేమో అనుకున్నా. టెస్ట్ అయాక ప్రిస్క్రిప్షనిచ్చా. కళ్లజోడు తెచ్చి చూపించింది. వాడుకోటం అద్దాలు తుడిచి పెట్టుకోటం మరిచి పోరాదని చెప్పాను. స్నానం చేసేప్పుడు, నిద్రబోయేప్పుడు తీసి గుర్తుగా పెట్టుకోవాలి. స్పెక్ట్స్ లేకుండా సినిమా చూడరాదు. ఇతరుల స్పెక్ట్స్ వాడరాదు. భూతద్దాల నుండి చూడరాదు. అద్దాలు తుడవటం మరిచిపోరాదు. తలనెప్పి వస్తుంది. తల్లో నరాలు దెబ్బతింటాయి. రెండేళ్లకోసారి టెస్ట్ చేయించుకుంటూ అద్దాలు మార్చాలా తెలుసుకోవాలి'' అని భద్రతలు చెపితే తీయగా నవ్వుతూ ''అలాగే డాక్టర్!'' అన్నది ఫీజూ యిచ్చింది. కాని ఆమెను గురించి వార్తలు వింటే నేను చెప్పిన భద్రతలు పాటించలేదని తెలిసింది. అందుకని అడిగాను'' అన్నాడు. జాలి వెల్లడయేట్టు చిన్నగా నవ్వాడు దయాసాగర్. '' ఇ యన్ టి సర్జన్ కపర్దీ నీలాగే అడిగాడు. చెవులో చీమ తిరుగుతున్నట్టున్నదనీ చూడమనీ, పిచికారీ చేయమనీ కన్సల్టేషన్‌కి వెళ్లిందట. జబ్బేం లేదని నర్స్ పిచికారీ చేస్తుందని సర్జరీలో కూచోబెట్టి వెళ్తాడుట. ఆలస్యమైందిట. వచ్చి చెప్పిందట కపర్దీతో. ''మీ నర్స్ రెండు గంటలు కూచోబెట్టె అందరూ వెళ్లాక యింత నువ్వుల నూనె చెవులో పోసి దూది కూరింది డాక్టర్. పిచికారీ లేదు దాని బొందా లేదు. దానికి ఫీజిచ్చుకోవాలా?'' అని వెళ్లిపోయిందట. అది హెరిడిటరీ. భద్రతలు చెప్పాను. మా అమ్మాయి అన్నది. 'పరీక్షకి చదువుకోవాలని రిజైన్ చేశాను సరోజా'' అన్నది మా టీచర్ నాన్నగారూ. మా ప్రిన్సిపాల్ శారదాబాయిగారు, ''శలవు పెట్టు గజలక్ష్మీ రిజైనెందుకూ?'' అంటే నవ్వుతూ వెళ్లిపోయింది గజలక్ష్మి టీచర్. ''చుట్టూ వున్న వాతావరణం గూడా బాగా లేదని నా అభిప్రాయం పినాకీ! ఇష్టంలేని విషయాలెత్తుతారు. పరీక్ష గట్టెక్కిందనే విన్నా.

డబ్బు విషయంలో గూడా బాధలున్నాయి. డాక్టర్ రంగనాయకమ్మ ''మానసిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండంట్. భర్తా రంగనాధ్ నా సహాధ్యాయి. ఇద్దరూ వచ్చారు. గజలక్ష్మి ఆమెను కన్నల్లు చేసిందట'' అంతా నా సొమ్ము తింటున్నారు డాక్టర్. తినవద్దంటే ఖాతరు చేయరు. అంతా కోల్పోయి, మోడై, యేదో వుద్యోగం చేస్తూ కాలం నెట్టుతుంటే '' ఆడపిల్ల సంపాయిస్తున్నది మనం కూచుని తినరాదనుకోరు. బంధు ప్రీతివల్ల చూడటానికెళ్తే బోడి వుద్యోగానికే అదిరిపాటు, ఆరుపాటు జరుగుపాటు. మూడు పాళ్లు అంటూనే నా చేతిలో వున్నదంతా ఖర్చు చేయిస్తారు. మమ్మీ యింత వుడకేసన్నా పెట్టదు. నేనే వండాలిట. యిల్లు పట్టిన విధవాడబడుచునిట. చేతనైతే వేరేవుండు అని ఛాలెంజ్ చేస్తుంది మమ్మీ. సాహసించి వున్నా నన్ను బతకనివ్వదు. నా మీద నిఘా పెడ్తుంది. నా కోసమెవరూ రారాదు యెక్కడా బతకనివ్వరు'' అన్నదిట గజలక్ష్మి. దేశాటన చేస్తే మంచిదేమో. దీపాలు వెలిగి తక్కిన డాక్టర్లు వచ్చి పిలుచుకెళ్లారు. పిక్చర్ చూడాలిట. స్క్రీన్ పెట్టారు.

3

డాక్టర్ దయాసాగర్ దగ్గర్లోవున్న గ్రామాని కెళ్లి తన పేషంటుని చూసి కారులో తిరిగి వస్తున్నాడు. ఫ్రెండ్ గౌరీనాథం యెటుపోతే అటు కారు కడ్డం వస్తుంటే, కారు ఆపేసి దిగాడు.

''గౌరీనాథం! యిదేం పని? ఆత్మహత్య తలపెట్టావా? వెలవెల పోతున్నావే. ఇంటి పరిస్థితులు బాగా లేవా? అంత పరాకేమిటీ. నేను గనక సరిపోయింది. మరొకడైతే హిట్ అండ్ రన్ అని వెళ్లిపోయేవాడు. దారినపోయే దానయ్య నిన్ను హాస్పిటల్లో చేర్చేవాడు''.

గౌరీనాథం ధర్మాసుపత్రి నడుపుతున్నాడు ''నువా మిత్రమా! గజలక్ష్మికి తీవ్రమైనట్టున్నది. అందరూ పరిగెత్తుకెళ్తుంటే చూసి నేనూ వెళ్లాను పాతబాంకీవేపు. వాతవరణానికి తట్టుకోలేక అంతరాత్మతో పోరాడలేక పరిపరివిధాల పోయే మనస్సుకి పగ్గాలు వేయలేక, పరీక్షలూ మానక, సబ్జక్ట్సు గుర్తుంచుకోలేక విధితో పోరాడుతూ సతమతమౌతూ వుంటుంది గజలక్ష్మి. వాళ్ల యింటి ముందు యెత్తైన అరుగుమీద నిలబడి అగ్నిపర్వతంలాగా లావా కక్కుతున్నది గజలక్ష్మి. ముప్ఫై యేళ్లనాటి విషయాలు తవ్వి గుర్తొచ్చిన భాషవాడుతూ అశ్లీలపదాలూ దొర్లిస్తున్నది. కమలమ్మేమో నేలమీద పడివున్నది. బ్రదరేమో, కొట్టలేక, తిట్టలేక తుపాకీ పట్టుకొచ్చి భయపెడుతున్నాడు. జనం పోగయి నిలబడి చూస్తున్నారు. మనిషిని చూసి ఆనందిస్తున్నారు. కాళికలాగా వున్నది. అర్థం పర్థం లేని ప్రేలాపన వింటున్నారు. హావభావవిలాసాలు, బాషా సౌందర్యం ఆహ్లాదమిస్తున్నాయి'' అంటున్నాడు గౌరీనాథం. ఆందోళన వెల్లడైంది.

''మరి తమాషా చూడక వచ్చేశావేం గౌరీనాథ్ ?''.

''తుపాకీ చూడగానే గుండె దడదడలాడింది. అతనికి లైసెన్సున్నదో లేదో! నిజంగా తూటాలున్నాయేమో! ట్రిగ్గర్ మీద వేలుంచాడు. ఆత్మరక్షణకని యిచ్చారేమో మరెవరైనా టాడా కేసులో యిరికిస్తారేమో వానిని. నన్ను సాక్షిగా వేసుకోవచ్చు. కమలమ్మ బతికివున్నాదో లేదో. తల పగిలిందేమో రక్తపు మడుగులో వున్నది తల''.

''నేను తోడు వస్తాను యిద్దరం పోదాం రా'' దయాసాగర్ తలుపుతీసి పట్టుకుని గౌరీనాథాన్ని కారు లోపలికి వెళ్లమన్నాడు.

గౌరీనాథం పుత్సాహం లేకుండా అన్నాడు ''పోనిద్దూ మనకేం పట్టె. పిలవని పేరంటమునకు పోరాదు'' నవ్వాలని చూశాడు.

''స్త్రీ గదూ! భూదేవిని వరాహ నరసింహ కాపాడలేదూ. మానవహక్కుల పరిరక్షణ చేద్దాం'' అని నవ్వించి తీసికెళ్లాడు.

గమ్యం చేరారు. గజలక్ష్మి లావా కక్కుతోంది. వేడి లావాలాంటి తమ గడిచిన ప్రతాపం వెల్లడౌతున్నదని కొంతమంది నిర్ణయించారు. ధగధగలాడుతూ, పెద్దజుట్టు గాలిలో కెగురుతూ గజలక్ష్మి తీవ్రమైన గొంతు, తీవ్రమైన చూపు కలిసి అగ్నిపర్వతంలాగే వున్నది.

ఒకడు సాహసించి అగ్నిపర్వతం దగ్గరసాకెళ్లి అన్నాడు.

''మందు వాడితే సరిపోలా గజలక్ష్మమ్మా. డాక్టరు బాబు చెప్పిన భద్రతలు పాటిస్తే బావుండేదిగా గజలక్ష్మమ్మా. తల్లిని చంపావే. కత్తిపీటతో మెడకోశావా? రోకలితో తల పగలగొట్టావా పొద్దున్నే?''

నిప్పులు కక్కింది గజలక్ష్మి. కళ్లు పెద్దవైనై.

'' ఆమె డాక్టరు బాబు మీద లక్ష్యముంచి, బాబు చెప్పిన భద్రతలు పాటించిందా? నా మానాన నన్నుండనిచ్చిందా? ఆస్తి యెవరికి వ్రాసి యిస్తానోనని తరుముకొస్తుంది. లోకానికేం తెలుసు. యెక్కడా బతకనివ్వక వెంటాడుతుంది. ఆకలేసి అన్నం పెట్టుకు తింటుంటే ''అవి తినరాదన్నాడు డాక్టరు'' అంటూ పల్లగోంగూర పచ్చడీ అన్నం కొబ్బరి ముక్కలల్లే వున్న నీరుల్లి ముక్కలూ యెత్తుకుపోయి చెత్తకుండీలో పారేసి వచ్చింది. చప్పిడి తిని నాలుక చవిచస్తే, యింత వూరగాయా అన్నంలో నూకల నెయ్యి పోసుకుతింటున్నా. బియ్యం

నావే. నా రైతు నా పొలం మీది ధాన్యం దంపించి దంపుడు బియ్యం బస్తాడు తెచ్చిచ్చాడు. నేనే బిరుసుగా వండి వడ్డించుకున్నా. నా అన్నం మీద పడియేడుస్తారేం? పోనీ చిక్కని కాఫీ అయినా తాగనివ్వరూ. స్వయంగా చేసుకుని స్ట్రాంగ్ కాఫీ వేడిది ఒక్క గుటక వేశానో లేదో రైయ్యన వచ్చి గ్లాసులాగేసి తను తాగేస్తుంది మమ్మీ. సిగ్గులే? తనూ విడోయే. బావగారు వడేసి పట్టాలని పొంచివుండి నా మీద కురికితే నేర్పుగా పోట్లావు వేపు నడిపించి, ఆవుకుమ్మింది వాడిని. మమ్మీకి బావగారున్నాడు. దేశభక్తుని వేషం, ప్రజాసేవ చేస్తున్నట్టు పోజు పెడతాడు. నిజంగా చూస్తే రుద్రాక్షపిల్లి. సరిగ్గా భోజనం వేళ వచ్చి, దొంగమడి గట్టి పీటమీద ఆసనశుద్ధిగా కూచుంటాడు. నేను కడుపునిండా తిందామని వండుకున్న తవ్వెడు గిన్నె అన్నం విస్తట్లో తోడాల్సి వచ్చింది. చెంబులో నీళ్ల వంచి ఔపోసన పట్టి ''కృష్ణా!'' అని పొలికేక పెట్టాడు. కృష్ణుడు ఆ దరిదాపుల లేకుండా పారిపోయాడు. తోడిన అన్నమంతా ఆధరువులతో సహా స్వాహా చేసి గ్రామోద్ధరణ చేయటానికి డౌన్‌ట్రాడెన్ని పైకి తేవటానికీ నడుం బిగించి వెళ్లాడు గోముఖవ్యాఘ్రం. నా ఆపదలో యీ రుద్రాక్షపిల్లి యెక్కడ చచ్చాడో!'' అంతలోనే గజలక్ష్మి నవ్వుతూ ''బందిపోటు యెవడురా''అని పాడింది. పితృ దేవుడూ ''చాప చిరిగినా చదరంత వుంటుంది'' అనే సూక్తి వల్లించి అప్ప యొక్క దత్తపుత్రునికి అర్ధాయుష్షు వాడికి కన్యాదానమిచ్చి చేతులు కడుక్కున్నాడు. పితృ దేవుడు దివికేగి తన సూక్తిని జంగావటం చూశాడు. అంతా కోర్టు పక్షులు, మతపిచ్చిగల వారైపొయె జ్ఞాతిశ్చేదనలేదే? అన్నారు. కాపరానికెళ్లిన కొత్తల్లోనే మేడలో దక్షిణ వేపు తేనెతుట్టె పెట్టింది. అదే గుర్తు. దాన్ని తగలబెట్టి మేడ పాడుబెట్టి మరో వూరు వెళ్లి అద్దె యింట్లో వుంటే, దొడ్లో అంట్లుతోమే చోట మొండిచేయి మొలిచింది. దాని నుంచి రక్తం వుబుకుతూ వుంటుంది. అదీ

సూచనే. తమ్ముణ్ణి బెల్లించి ఆస్తి అమ్మించే కోర్టు పక్షులెన్నో. పెంపుడు తల్లీ లక్ష వత్తుల నోమూ, గ్రామ పసుపుకుంకుం, ఆకామావై, యాత్రలూ చేస్తూ భూములమ్మించింది. ఆచారాల వెనకవున్నది ధనకాంక్షే. చుట్టాలు కట్టెలు అనేది నిజం. దేవుడు నయంగాని వ్యాధి అంటించి భీముడంటి నా బిడ్డనూ యెత్తుకపోయాడు. నియర్ అండ్ డియర్ కళ్లు చల్లబడినై. అందుకే యాంట్కా జవాబ్ పత్థర్సే దేనా అనేది మెచ్చుతాను. బాగుపడాలనే, సోమరిని కాగూడదనే పరీక్షలు వ్రాసి జాబ్ కొట్టితే బెల్లమున్నచోట చీమలు చేరినై''. అంతలోనే మొహంలో రక్తం గూడు కట్టి బిగిసింది. ''సోమరులను కూచోబెట్టి తరిపి దూడలను మేపినట్టు మేపాలా? కొత్తగా వైధవ్యం అంటుకున్నట్టు, కాలూ చెయ్యి చూపూ వినికిడీ అన్నీ సవ్యంగా వున్నవారిని దయగా గౌరవంగా చూస్తూ పోషించాలా? ఆడపిల్ల జాబ్ చేస్తున్నది మనం కూచుని తినరాదనే ఆలోచనే రాదా?'' అంటుండగా అశ్లీలపదాలు దొర్లసాగినై.

యూదు మతంలో ఒక ఆచారమున్నది. పతిత స్త్రీని రాళ్లు రువ్వి చంపటం. అప్పటికి కరుణామయుడైన యేసు ప్రభువు పెద్దవాడై, అట్టి శిక్ష చూడటం జరిగింది. అడ్డు వెళ్లి ''యెట్టి పాపము యెట్టి తప్పిదమూ చేయని వారే రాయి విసరండి'' అంటూ వంగి రాయి అందుకుని లేచి తలెత్తి చూస్తే అంతా వెళ్లిపోయారు. రాయి కిందబడేసి, ఆ పతితను దయతో చూస్తూ, ''సిన్ నో మోర్'' అన్నాడు.

గజలక్ష్మి నోటిదుడుకుకి వెరిచి జనం పల్చబడ్డారు.

దయాసాగర్, గౌరీనాథం తక్కినవారినీ తరిమేశారు. తుపాకీ యింట్లో పెట్టి రమ్మని సోదరుని తోలారు. స్పృహలేని కమ్మలమ్మను మోసుకెళ్లి కారులో

వెనకసీటులో వుంచారు. గజలక్ష్మిని మంచిమాటలతో తీసికెళ్లి ఫ్రంట్ సీటులో బెట్టి కారుతోలు కెళ్లారు.

4

హిప్నోథెరపీ దీర్ఘవ్యాధులు కుదర్చబడును అనే బల్లకట్టివున్న బిల్డింగ్‌లో స్పెషల్‌రూమ్‌లో బెడ్‌మీదున్నది గజలక్ష్మి కర్టెన్ కదులుతున్నది. ఇవతలి రూమ్‌లో కుర్చీలలో ముగ్గురున్నారు. నర్సింగ్‌హోమ్ రన్‌చేసే చంద్రమౌళీ డ్రాయరు ముందున్నాడు. యెదురుగా డాక్టర్ దయాసాగర్, అతని పక్కన కుర్చీలో లాయర్ రంగనాధ్ వున్నాడు.

''యెలా వున్నది?'' దయాసాగర్ అడిగాడు.

'' ఉధృతం తగ్గింది. కొంత నార్మల్సీ వచ్చింది. మర్యాదగా శాంతంగా వివేకం గలిగిన దానిలాగే మాట్లాడింది పేషంటు. ఈ మనిషేనా అలా రెచ్చిపోయిందన్నారు అని ఆశ్చర్యం కలగచ్చు. యేదో తీవ్రమైన కోరిక నెరవేరక బాలెన్సు పోయి వుండాలి. వంశానుగతమైన జబ్బులకి కారణాలక్కర్లేదు. తల్లికెలా వున్నది? ఆమె బతక్కపోతే కేసౌతుంది. మతిస్థిమితం లేదనీ, తెలిసి చేయలేదనీ తప్పించాల్సి రావచ్చు. పేషంటుకి మంచితిండి పుష్టీహరాయించుకునే శక్తీ వున్నాయి. యేదైనా జాబ్‌లో వుంచి కనిబెట్టి వుంటే మంచిదేమో'' అన్నాడు మౌళి. ''కమలమ్మ బతికింది. తెలివిరావాలి. ఆమెను కూతురుకి దూరంగా వుండమంటే మంచిదేమో. రక్షణ లేకుండా యెలావుంచుతాం అంటాడు సోదరుడు. ఐవేజు తేవటానికి సాయం వుండాలి అంటాడు. విషవలయంలో చిక్కుకున్నది. ఖర్చులుంటాయి. యేమంటావ్ రంగనాధ్?'' అన్నాడు దయాసాగర్.

''నేనూ విన్నాను. ఆవిడ నిక్‌నేమ్ మీరు వినలేదా! ఆలిండియా రేడియో వార్తలందిస్తున్నది అని నవ్వుతారామె ఫ్రెండ్స్. అందరికీ సాయపడుతుంది గదూ రానిస్తారు పిల్చుకెళ్తారు గూడాను ఆవిడని. పెత్తనాలకీ వెళ్తుంది. గజలక్ష్మిని వాళ్లవాళ్లు వదలరు. నేర్పుగా లాగేస్తారు లేదా ఖర్చు చేయిస్తారు. అదే యిష్టం లేదు గజలక్ష్మికి. తనకు తోచిందిస్తే తీసుకోవాలి అంటుందిట. వీక్‌నెస్ యేమనగా ఒక్కతే వుండలేదు. పట్నవాసం కావాలి. నిర్వహణ తెలియదు అందుకని నవ్వుకుంటూ ఒకపథకం చూసిందట'' అని నవ్వసాగాడు రంగనాథ్ లాయరు.

''చెప్పు మరి. తెలుసుకోవాలిగా'' అన్నాడు మౌళి. దయాసాగరూ రంగనాథ్ వంక నవ్వుతూ చూశాడు. ''ఒక రిచ్ బోయ్‌ఫ్రెండ్‌ని సంపాయించి, వాడు డాక్టరై వుండాలిట, పొజిషన్, వుద్యోగం వుండాలిట, కన్సల్టేషన్ కోసం, వైద్యం కోసం వెళ్తున్నట్లు వెళ్లి పాకెట్‌మనీ తెచ్చుకోవాలని. అపుడు తనవారు తనను గుంజినా, నొల్లుకుపోయినా దండుకుపోయినా చింతవుండదుట. తన పాకెట్‌మనీని వారు సంగ్రహించలేరుట. అంత గోప్యంగా వుండగలను వుంచగలను యెఫైర్ని అని ప్లాను. అట్టి తెలివిగల వారిని, బంధువులలోనూ, కొలీగ్స్‌లోనూ, పరిచితులలోనూ, స్నేహితులలోనూ చూసిందట'' మళ్లా ఆపాడు లాయరు. తక్కినవారిని చూస్తే కానీమన్నట్టున్నవి వారి చూపులు. కంటిన్యూ చేశాడు ''డెస్డెమోనా అయాగో పెళ్లాంతో తన వ్యథ చెప్పుకునేదట. ''తెల్లవారి అమ్మాయిలు తన జాతి అబ్బాయిలనే చేసుకోవాలి. నా పరిస్థితి గుణపాఠంగా తెలుసుకోవాలి. అయాగో కూతుర్ని చిన్న అమ్మాయిని ముద్దులాడటానికి వెళ్లేదట డెస్డెమోనా. ''అదేం పోలిక రంగనాథ్? ఇప్పుడా కథెందుకు చెప్పావు. గజలక్ష్మి ప్లానెందుకు పాడైందిటా?'' అనడిగాడు దయాసాగర్.

''పథకం పారకపోగా బెడిసికొట్టింది. ఒంటరిగా రావద్దని కూకలేశాడు. వినక నవ్వితే తానే ఒక నర్సుని ఆయానీ పేషంటుకి రెండువేపులా వుంచాడు. ప్రతీదానికీ నేర్పుకావాలి. ఆ వుద్యోగిని ప్రభుత్వం స్టేట్స్‌కి పంపించారు''.

'' ఐసీ! ఒకే ఆలోచన మీద ఆగిపోయి అదే ఆలోచిస్తూ వుండగా బాలెన్స్ ఆఫ్ మైండ్ పోయి వుండాలి. దశరథుని మనస్సు అలాగే వికలమైంది. కైక రాజ్యమడుగుతుందేమో రామునికే రాజ్యమప్పగించటమెలాగా అని ఆలోచిస్తుండగా వికలుడైనాడు''.

''నాకు వేరో చోట యెంగేజ్ మెంటున్నది. ఉపమానాలు బాగాలేవు. మీ అబ్బాయికి బాగా నిమ్మళించింది రంగనాథ్. తీసికెళ్లచ్చు. జాండిస్ మూడునెలలుంటుందన్నాగా? మూడు నెలలు ముగిసి పైన వారమైంది. వాంతులు కావటం లేదు. వికారం లేదన్నాడు అబ్బాయి శాయిరాం. ఫీజివ్వాలనుంటే గజలక్ష్మి మీదికి కేసు యెక్కకుండా చూడు. ఆమె చేసే పనులకామె బాధ్యురాలు కాదు అని వాదించాలి. తెలియకే చేస్తున్నది. బేసిక్‌గా మంచి మనసున్న అమ్మాయే''.

''తప్పకుండా చూస్తాను డాక్టర్. అప్పులు చేసి తీర్చదుట. ''మమ్మీ తీరుస్తుంది నా డబ్బు ఆమె వద్దే వున్నది'' అంటుందిట. తెలియకే చేస్తున్నది. తీర్చే బాధ్యత లేదు అని అపుతాను'' అని నవ్వసాగాడు లాయర్ రంగనాథ్.

## 5

మళ్లా యేర్పాటైన సెమినార్లో కలుసుకున్నారు మిత్రులు. సెమినార్ రెండు రోజులు జరుగుతుంది. వాళ్లు డిన్నరుకి రాము. లంచ్ చాలు అని నవ్వుతూ

ఆర్గనైజర్‌తో చెప్పారు. వాళ్లు మంచి రెస్టారెంటులో ఒక మూలగా రిజర్వ్ చేయించుకున్నారు. స్వంత పనులు, తెలిసిన వారిని చూచి రావటం పూర్తిచేసి యెనిమిదింటికల్లా రెస్టారెంటులో కలుసుకున్నారు. సెమినార్ బాగున్నది. వైకల్యమనేది పరిస్థితుల ప్రాబల్యమా, గైడెన్సు లేకను, పైతృకమా, ఇన్‌ఫెక్షన్ వల్లనా అలా అనేక పాయింట్లు మీద కొద్దిసేపే మాట్లాడారు. ఒక డాక్టర్ హ్యూమర్ వుపయోగించి ''పళ్లలో జబ్బువుండి, అది ముదిరితే మెదడు నరాలు దెబ్బతింటాయి. పళ్లు తీసేయించుకోవాలి. జబ్బు నాపచ్చు. కనీసం కంట్రోల్ చేయచ్చు. పళ్లరంగు మారుతుంది. లైట్ గ్రీన్ నించి గ్రీన్ రెడ్‌లోకి మారుతుంది. మొగుడుపోతే జుట్టు తీయించుకుంటున్నారుగా స్త్రీలు. ఇదీ అలాగే అనుకోవాలి. వ్యాధి మనిషిని పాడుచేయక ముందే పళ్లు పీకించుకుంటే మంచిది. మనిషిలాగా వుంటారు. నవ్వులపాలు గారు, హానిచేయరు'' అంటూంటే చప్పట్లు కొట్టి సంతోషంతో నవ్వారు శ్రోతలు. తరవాత ఏ థెరపీ సత్ఫలితాలిస్తున్నదీ మాట్లాడారు. నిరపాయకరమైన థెరపీ హిప్నోథెరపీ. దయాసాగరే మెను చదివి ఆర్డరిచ్చాడు.

''యెలా వున్నది పేషంటు మౌళీ? నీ థెరపీ మంచి ఫలితానిస్తున్నదా ? దయాసాగర్ అడిగాడు.

''గజలక్ష్మికి ఆ జబ్బు పుట్టుకతోనే వున్నదని నా అభిప్రాయం. హిస్టీరియా అని పేరుబెట్టి ఆనందించేవారేమో. ముద్దు చేసి వుండాలి. బాల్యం దాటాక, యేదో పెళ్లి, చదువు, పెళ్లి వేడుకలు, సంసారం, పనిపాటలూ ఆ జబ్బుని అణిచి వుంచాయేమో. పరిస్థితులు తారుమారై, మానసిక వేదనీ, హింసా, స్వంతవారిని కోల్పోవటం, బాధ్యతలు లేకపోవటం, యెవరికోసం చేయాలి అనే ఆలోచనవచ్చి

స్వార్థం పైకిరావటం, స్వంత మనుషుల ఇన్‌డీసెంట్ బిహేవియర్ కారణాలై మొదటి జబ్బు తీవ్రమై పైకి తెలివుండాలి. వివశ అయి వుండాలి. నా థెరపీ తాత్కాలికంగా ఉధృతం తగ్గిస్తున్నది. ఆపేస్తే కాస్తకే రెచ్చిపోయి చాలాసేపు అరుస్తుంది. దానివల్ల మిస్టరీలు విడిపోయే అవకాశం వస్తుంది'' అని భోజనం మొదలుపెట్టి పులావ్, పుల్లిపచ్చడి స్పూన్‌తో తింటున్నాడు మౌళి.

''కేసు సమసిపోయిందా? తల్లి బాగుందా? మిస్టరీ యేమిటీ?'' అగ్నిహోత్రి అనే బ్రెయిన్ సర్జరీ చేసి ట్యూమర్ తొలగించే స్పెషలిస్టు అడిగాడు. స్టేట్స్‌నించి నెల సెలవు మీద వచ్చాడు. సెమినార్‌కి అటెండయి అందర్నీ కలుసుకుని సంతోషించాడు. డిన్నర్‌కి వచ్చాడు. బ్రెయిన్ ఇన్‌ఫెక్ట్ అయితే స్టేట్స్‌లో యిచ్చే ట్రీట్‌మెంట్ చక్కగా చెప్పాడు. గజలక్ష్మిని గురించి కొంత తెలుసుకునే వున్నాడు.

లాయరు రంగనాథం ఎక్సైటైపోయి అన్నాడు. '' ఆ విషయం నేను విపులీకరిస్తా మిత్రులారా. నన్ను పెట్టిందే అందుకు. తల్లి కమలమ్మగారికి స్మృతి వచ్చింది. అడిగితే గజలక్ష్మి నర్సింగ్ హోమ్‌కి నా దగ్గర డబ్బు లేదు. యెవరు అడ్మిట్ చేశారో వారిదే బాధ్యత. ''నా సొమ్ము తింటున్నారంతా''నని అందరెదుటా దుమ్మెత్తి పోస్తుంది కూతురు. నిజం తెలుసుకుంటే దాని ఐవేజే దానికి చాలదు. వుద్యోగం వూడింది. మందులు, ఇన్‌జెక్షనులు టానిక్కులు కొనుక్కుంటుంది. యేనుగ తిండీ, ఇటు చెంబు అటు పెట్టదు. కన్నబిడ్డ మీద తీపి చావక దగ్గర పెట్టుకుని కాపాడుతున్నాను. తల్లి చేత యింత పెడదామనే లేదు గజలక్ష్మికి. పెద్దవాళ్లయాక యెవరి దోవన వారుండాలి అని సాధించి వేరే వున్నది. ఆ సంబడమూ అయిపోయింది. అద్దె చెల్లించలేదు. తలుపులు తీసిపెట్టి యెటో పోయిందిట. చూసినదల్లా కొంటుంది. వారపత్రిక, ఏపిల్, ద్రాక్ష,

కిస్మిస్, బోండాం, బ్రెడ్, సినిమా, ఒకటేమిటి. దానిష్టమే యిష్టం. తెలివి తక్కువగా అంతా కోల్పోతే లాయర్ల నాశ్రయించి, కోర్టు చుట్టూ తిరిగి దీనికి చెందాల్సిన ఆస్తి దీనికి చెందేట్టు చేయటానికి నా చేతి చమురు వదిలింది. హర్షించిందా కూతురు? లేదు. ''కోర్టు పక్షి మమ్మీ. గొప్ప వ్యవహర్త. అల్లుడూ మనవడూ యెప్పుడు టపా కట్టేస్తారా, యెప్పుడు ఆస్తికోసం భాగం కోసం దావా వేద్దామా అని పొంచివున్నది మమ్మీ. దిమ్మరి మమ్మీకి దిమ్మ తిరిగేందుకు ఛాన్సు యిచ్చాడు దేవుడు'' అని పకపకా నవ్వింది చుట్టాలెదుట'' అని తల్లి కమలమ్మ వలవలా యేడిచింది గజలక్ష్మి మీద కొన్ని కేసులున్నాయి. అప్పులు చేసిందట. మమ్మీ తీరుస్తుంది. నా డబ్బు మమ్మీ రొంటిన వున్నది తీసుకోండి అన్నదట గజలక్ష్మి. అప్పులు తీర్చే బెడద వదిలించమన్నది కమలమ్మ''.

వేడి భోజనం రుచిగా వున్నది. తింటున్నారు.

''విడిపోయిన మిస్టరీ యేమిటి?'' గుర్తు చేశాడు దయాసాగర్.

''యెప్పుడో నా చిన్నప్పుడు కథలు విన్నా. ఒక గొప్ప జ్యోతిష్కుడు. ఆయనకి క్విక్ టెంపర్. పొరపాటున భార్యను హత్యచేశాడు. ఉద్దేశపూర్వకంగా గానీ, ప్లాను వేసి గానీ చేయలేదు. అదీ రాత్రి పదిగంటల వేళ జరిగింది. తెల్లారేసరికి అంతా తారుమారు చేసి, అది ఆత్మహత్య అని నిరూపించి ఆయన్ని కాపాడారూరివారు. శిక్ష తప్పించారు. ఆయన పశ్చాత్తాపడలేదు. ఆ గొప్పవాని దేహిత్రే గజలక్ష్మి''. పెరుగన్నం తింటున్న మౌళి అన్నాడు ''చాలా తెలివితక్కువ పనిచేశారు బంధువులు డాక్టర్! ప్రూవ్ చేసి చెట్టుకి వేలాడదీయాల్సింది ఆ భర్తన్ని లేదా చెట్టుకి క్రూసిఫై చేయాల్సింది. యూదుల మతంలో మొదట చెట్టు బోదెకే క్రూసిఫై చేసేవారని ఎన్సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికాలో వున్నది. నేను లేనప్పుడు.

వుంటే ప్రూవ్ చేసేదాన్ని. అది థర్డ్ డిగ్రీ మర్డరనన్నా శిక్ష పడేది'' అని నవ్వింది గజలక్ష్మి. ''అది మరొక తప్పిదం కాదా గజలక్ష్మీ?'' అన్నా. '' ఆయన శరీరాన్ని కాపాడితే యేం లాభించింది? శరీరం ఆత్మకాదు గదా. నిజమూ బైటబడింది. కాలం గడుస్తుండగా బిడ్డలూ పాడైనారు. నాకీ వైకల్యమందుకే వచ్చింది. మోతీలాల్ చేసిన త్యాగాలుకి ఆయన కొడుకే గాక, మనమరాలు, ముని మనమడూ ప్రియం అయినారు దేశానికి'' పకపకా నవ్వి మళ్లా అన్నది గజలక్ష్మి ''మమ్మీ చేసిన ట్రిక్కి మీరంతా డంగైనారు డాక్టర్. మమ్మీకి అరవై నాలుగు కళలొచ్చు. హత్య జరిగనట్టు, తాను చచ్చినట్టు కనికట్టు చేస్తుంది. రక్తపు మడుగులో తలవుంచి పడుకుని ఊపిరిబిగబడుతుంది. మీరు కథలూ గాథలూ వినలేదేమో డాక్టర్. మా బంధువు ఒకాయన ప్రతిపక్ష పార్టీవారు కాపువేసి పొంచివుండి, ఒంటరిగా వస్తుండగా చూసి కొట్టారు. పడిపోయాడు మా బంధువు. అనుభవశాలిగదూ బోర్లపడిన మనిషి వూపిరిబిగపట్టి లేవలేదు. ఆ ప్రతిపక్షాలు చచ్చాడనుకున్నారు. దూరాన మనుషుల్ని చూసి గుర్తు పడతారని దౌడుతీశారు. మనుషులొచ్చి బంధువు బతికే వున్నాడని తెలిసి మోసుకెళ్లి ఆస్పటాల్లో చేర్చారు. కోలుకున్నాడు బంధువు. పల్నాడు తాలూకాలో కొంతమంది బాగా బలిసి కావేషాలు పెరిగి అలాగే పొంచివుండి కాపు వేసి గుర్రాల గోపిరెడ్డిని కందిచేలో చంపారు. జానపద గాథలు బావుంటాయి. తల్లికొక్కడే కొడుకు తండ్రి పోయాడు. గోపిరెడ్డి గుఱ్ఱాలని కొని పెంచి తర్ఫీదిచ్చి దాని మీద స్వారీ చేస్తూ చేలగట్ల వెంబడి తిరిగేవాడు. అందుకని గుఱ్ఱాల గోపిరెడ్డి అని పేరుబడ్డాడు. దాయాదుల కన్నుకుట్టింది. ఆ తల్లి దుఃఖించదూ! '' ఓ! గుఱ్ఱాల గోపిరెడ్డీ! దాచేపల్లికే దానమైతివా? కొడుకా దహనమౌతివా? శేరుశేరు యెండి ముర్గులు చేతులకు పెట్టుకొనీ కట్టమీద వస్తావుంటే కలకటేరనుకొంటిరా, కొడకా!

దాచేపల్లికే దానమైతివా? గోపిరెడ్డీ! అని దుఃఖించింది తల్లి. అలాగే చిన్నపరెడ్డి. దొరలకు సింహస్వప్నమైనాడు. గడగడలాడించాడు దొరలని. కవులు గానం చేశారా ప్రజాసేవకుని మీద. 'సైసై! చిన్నప్పరెడ్డీ! రెడ్డీ! నీ పేరే బంగారు కడ్డీ! కడ్డీ!'' నవ్వుతూనే వున్నది గజలక్ష్మి. మీరు మీ చిన్నప్పుడు చూడలేదేమో డాక్టర్! నా చిన్నప్పుడు గారడీలు చూశాను నేను. మచిలీపట్నంలో వున్నామప్పుడు. అహోబలరావుగారని ఒకాయన. మెడిసిన్ చదివి వైద్యం చేసేవాడు. వెలమ గృహిణులు బంగారు మట్టెలు పెట్టుకుంటారు తెలుసా డాక్టర్? అనడిగింది'' తెలియదు గజలక్ష్మీ! చూడలేదు'' అన్నాను. ఆ డాక్టర్ ఫైనార్ట్స్‌ని ఆదరించేవాడు. కళాకారులొచ్చి తమ కళ చూచి గౌరవించమన్నారు. ఓపెన్ స్పేస్‌లో కవలు కార్పణ్యాలు, కొట్లాటలు చూపుతూ ఛురికతో పొడిస్తే శత్రువు పొట్ట పగిలి ప్రేవులూ రక్తమాంసాలూ బైటికొచ్చాయి. డాక్టరు గారు కేకలేస్తూ లేచారు. ''అతన్ని సర్జరీలోకి తెండి బాండేజ్ చేయాలి'' అనగానే కళాకారులు పకపకా నవ్వారు.

''చూశారా దొరా! నిజమనుకున్నారు. అలా భ్రమ కల్పించేదే కళ. అదే జాలం. పసుపు సున్నం కలిపితే రక్తవర్ణం వస్తుంది. వడికిన నూలు దానిలో తడిపి పిండి పొట్టకేసి కడితే ప్రేవులలాగా కిందబడతాయి. రంగు రంగుల కూరలు దుంపల ముక్కలు. నిమ్మ రసం ఆముదంలో ముంచి తీస్తే మాంసం ముక్కలలాగా దూది కండలాగా కనబడతాయి. కళాకారుడు బాగున్నాడు దొరా. ఈ కాస్తకే వుద్రేకపడ్డారు. ఇంకా గొప్ప కళవున్నది. గురువు ద్రోణుని గొంతు కొయ్యటం. భద్రంగా మేకప్ చేసే ఆటమొదలెడతాం'' అని దణ్ణం పెట్టారు కళాకారులు. డాక్టరు గారు నవ్వి ఆనందించి, రూపాయల సంచీ, పట్టు వస్త్రాలు యిచ్చి పంపారు. అలాటి జాలం చాలా వచ్చు మమ్మీకి అది రక్తముగాదు

ఆవిడ తల పగలనూ లేదు. పెయింట్ పారబోసి దానిమీద పడుకుంది. నేను చేయ్యి చేసుకోనూ లేదు. ఫూల్సులాగా మీరామెను ఇంటెన్సివ్ కేర్ రూమ్‌లో యెమర్జన్సీ రూమ్‌లో వుంచారు. నిద్రమాత్ర వేసుకున్నదేమో. పీలికగుడ్డలాగా వేలాడితే నమ్మారు'' అని విరగబడి నవ్వింది గజలక్ష్మి''. తానూ నవ్వాడు మౌళి. ''మీరంతా రేపు నా సర్జరీకి, నర్సింగ్ హోమ్ చూడటానికీ రావాలి. మోడరన్ ఎక్విప్‌మెంట్సు వచ్చాయి. మేగ్నెటిక్ థెరపీ చూడచ్చు గజలక్ష్మికి తగ్గిందా లేదా తెలుసుకోవచ్చు'' అన్నాడు చేయి తుడుచుకుంటూ.

''నార్మల్సీకి రాగానే జాబ్‌చేస్తాననదూ? ఆమె చేతిలో మనీ వుండనివ్వరే'' దయాసాగర్ అడిగాడు. భోజనం పూర్తి చేశాడు.

''అన్నది. అన్నది గదా అని చూపాను. ముచ్చెం మూడుసార్లు రాజీనామా దాఖలు చేసింది. మళ్లా మొదటి కొచ్చింది కథ'' వెయిటర్ యెదురుగా వుంచివెళ్లిన ఐస్‌క్రీమ్ కప్పు దగ్గరికి తీసుకున్నాడు.

''మూడే?'' ఆశ్చర్యం వెలిబుచ్చాడు శ్రోత. '' ఈ రోజులో జాబ్ దొరకటమే ఘనం''. చల్లని తీయని ఐస్‌క్రీమ్ నోటిలోకి పోనిచ్చాడు.

'' ఆమెకవేం కంటి కానలేదు. వర్త్‌లెస్ జాబ్ అంటుంది. మొదటిది ఎల్లైసీలో టెంపొరరీ క్లర్క్ పాలసీలు కొనిపించటంలో హెల్పర్. రెండోది పత్రికా ఆఫీసులో రెసెప్షనిస్టు. ఎట్రాక్టివ్ గదూ గజలక్ష్మి అడగగానే జాయిన్ కమ్మన్నారు. మూడోది నర్సరీలో చిన్నపిల్లలకి టీచరు. నర్సరీ రైమ్స్ యాక్షన్‌తో సహా నేర్పుతుంది. జాకెండ్ జిల్ వెంటప్‌ది హిల్ టు ఫెచ్ వాటర్. జాక్ ఫెల్ డౌన్ అండ్ హర్ట్ హిస్ క్రౌన్ జిల్ కేం టబ్లింగ్ ఆఫ్టర్'' అని నేర్పుతుంటే పిల్లలు

ఆమెననుకరిస్తూ నవ్వుతారు. మెప్పు పొందింది. కాని స్థిరత నహి అదే రావాలి నా థెరపీ వల్ల''.

అంతా లేచారు. బిల్ చెల్లించాడు. కార్లలో బయలుదేరారు.

6

థెరపీ యెంత త్వరగా సత్ఫలితమిస్తున్నదీ చూడాలనే వచ్చారు మిత్రులు. మరికొందరు బ్రేక్‌ఫాస్ట్‌కి పిలిచారు. ఒక్క మిత్రునికే మాటిచ్చారు. ప్లేన్ పదింటికి. విమానాశ్రయం దూరం.

లోపలి కడుగుంచేప్పటికి జలతరంగిణి వినిపిస్తున్నది కీర్తన సాధించెనే. వచ్చిన వారిలో ఒకరికి క్లాసికల్ మ్యూజిక్ వచ్చు. చిన్నప్పుడు నేర్చుకున్నాడు. నిలబడిపోయిన వారిని వసాలి వచ్చి పిలుచుకెళ్లి మెత్తలున్న సోఫాల్లో కూచోబెట్టాడు. వేఫర్ ప్లేటు యెదురుగా గుండ్రని బల్ల మీదుంచాడు పరిచయం చేశాడు.

''వీడు నా చిన్ననాటి మిత్రుడు భగవాన్. ఒక యోగి వద్ద హిప్నాటిజమ్ నేర్చాడు. ప్రయోగించి చూస్తున్నాడు. అతని బలీయమైన కోరిక ఇన్‌క్యూరబుల్ డిసీజెస్‌ని క్యూర్ చేసి విజయబావుటా యెగరేయాలని. డాక్టర్లు కొత్త వ్యాధులకి మెడిసిన్స్ కనిబెడతారే అలాగా అన్నమాట. మేరీ క్యూరీ దంపతులు రేడియం కనిబెట్టి దాని వుపయోగం వైద్యరంగంలో చూపగలిగారు. అలా చెప్తుపోతే జీసస్సూ పేదలకు వైద్యం చేసే లెప్రసీ క్యూర్ చేసే ఫేమస్ అయినాడు. బైబిల్ కథలున్నాయి. గుడ్డి, మూగ, చెముడు, కుంటి అన్నీ క్యూర్ చేయగలిగాడు తన దయాగుణంతో. కరుణామయుడని ఫిల్మ్ తీశారు. మనకున్న అథర్వణ

వేదమంతా వైద్యమే. ఆయుర్వేదం ఓషధులతో బాటు మంత్రాలూ అప్లై చేశారనుకోండి. బౌద్ధులు మూలికా వైద్యం వ్యాప్తిలోకి తెచ్చారు'' అంటున్నాడు మౌళి.

''హిప్పోకి డయట్, నియమాలు వున్నాయా?''

'' ఉన్నాయనే అంటున్నాడు భగవాన్ శాంతి దాంతులు ముఖ్యం''.

''దాంతి అంటే?''

''నిగ్రహం. బుర్రయేం చేయమంటే అది చేయగూడదు. అది చుట్టువున్నవారు గూడా పాటించాలి. వ్యాయామం, మెడిటేషన్''

''గుంజీలు తీయాలా?''.

''అక్కర్లా. షోగ్గా యీత నేర్చుకుని హోఫెనవర్ యీతకొలనులో యీత కొట్టచ్చు. దాంతో తలారా స్నానం గూడా కలిసొస్తుంది''.

''నిగ్రహమంటే యేం చేయాలీ?''

''యెదుటివారు నొవ్వనాడినా, గేలిచేసినా, గుడ్లుపెట్టుకు చూడాలి''.

''బాగానే వున్నది. గజలక్ష్మి పరీక్షలకి అప్పియరౌతూనే వున్నదా?''

''జంత్రీ వాయిద్యం యిదివరకే వచ్చా? థెరపీలో భాగమా?''

'' ఉద్యోగాలు మానిందిగానీ పరీక్షలు మానలేదు. యెమ్మేకి డబ్బు కట్టేసింది. అప్పియరౌతానంటున్నది. నాగపూర్ యూనివర్శిటీ, బెనారెస్ హిందూ యూనివర్శిటి అన్ని పరీక్షలు ప్రైవేట్‌గా అప్పియరయే వీలున్నదని ఆమే

తెలుసుకున్నది. ఓకల్ అండ్ వాయులీనం చిన్నప్పుడే నేర్చింది. హైయ్యర్ పాసైంది. ఇపుడు గిటార్, పియానో నేరుస్తున్నది''.

''ట్యూటర్ వస్తాడా?'' దయాసాగర్ అడిగాడు.

మౌళి బాగా నవ్వాడు ''వాడు డాక్టరే. మ్యూజిక్ థెరపీ అని రన్ చేస్తున్నాడు. పియానో టెక్నిక్ చెపితే చాలు. ఆమే ప్లే చేస్తున్నది'' అన్నాడు.

''మెడిసిన్ చదివాడూ?''

''ఆ, ఆ, చదివాడు. మెస్మర్ అనేవాడు మెడిసిన్ చదివే మెస్మరిజం కనిబెట్టాడు. హానిమాన్ అల్లోపతీ అయి వుండీ కూడా హోమియోపతీ కనిబెట్టాడు. ఆయనకు పెద్ద లాబొరేటరీ వుండేది. రక్తప్రసరణ వేగం, ఒకే వ్యాధి నయంవ్వై వళ్లా యెందుకొస్తుందీ అలా రీసెర్చ్ చేశాడు. మరీ పొడుగెందుకెదుగుతారు? పొట్టిగా యెందుకుంటారు? మ్యూజికల్ యినుస్ట్రుమెంట్స్ కొని నేర్చాడు''.

'ఫలితాలెలా వున్నాయి'' గౌరీనాథం అడిగాడు.

''అంత మంచి ఫలితాలనలేను. పూర్తిగా క్యూర్ చేసుకోవాలనే పట్టుదల లేదేమో అనిపిస్తుంది. కమలమ్మ వచ్చి రెచ్చగొడుతుంది. ఉడికిస్తుంది. కోపమొచ్చి రెచ్చిపోయి దగ్గరున్న డబ్బు తల్లి మొహాన విసురుతుంది గజలక్ష్మి. దానికోసమే వచ్చినట్లు అవి తీసుకుని వెళ్లిపోతుంది తల్లి. కూతురు చేయి జారిపోతున్నదేమో, తెలివిన బడుతున్నదేమో అన్నట్టు క్యూర్ యిష్టంలేనట్టు కనబడుతుంది. ఆమెకూ మతిచలించిందేమోననుకున్నా'' అని నవ్వుతున్నాడు మౌళి.

భగవాన్ లేచి యెదుటికి వచ్చాడు ''టైమైంది. నేను పోవాలి. నాకు వేరే ఎంగేజ్‌మెంటున్నది. అవసరమైతే ఫోన్ చేయండి'' అని అందరినీ చూసి నమస్తే అని వెళ్లిపోయాడు భగవాన్.

గజలక్ష్మి అవతలి గదిలోంచి అనౌన్స్ చేసింది. ''నెనరుంచినా మాళవిక రాగం'' తలెత్తగానే తల్లి కంటబడి వదిలేసింది.

''అప్పుడే వచ్చావెందుకూ? ఆకలితో ఛస్తున్నానా?'' అని నిలబడింది.

''టైమైంది. నా వెంట పంపండి డాక్టర్. తీసికెళ్లానికే వచ్చాను'' అని నవ్వు మొహంతో అన్నది కమలమ్మ.

''నమ్మకండి డాక్టర్. డబ్బుకోసమే వచ్చింది. బ్లాక్ మెయిలర్స్ ఆర్ నాట్ శాటిస్‌ఫైడ్ అని స్వంత అల్లుడే అన్నాడు మమ్మీని''.

''అందుకు రాలేదు డాక్టర్! ఇరుగు పొరుగువారు, ''వయసుమళ్లిన కూతుర్ని వైద్యం మిషపెట్టి ఒక్కతెనే పంపుతున్నారేమో. ఫొటోగ్రాఫర్లు గంటకింతా అని పే చేసి ఫొటోలు తీస్తారుట. నువ్వు యింట్లోనే వుండవు'' అని చెప్పారు డాక్టర్. హిప్నొథెరపీతో తగ్గిపోతుందంటే పంపుతున్నానంటే హేళనగా నవ్వి ''డాక్టరే గంటకింతా'' అని యిస్తాడా ప్రయోగించి చూసినందుకు'' అన్నారు.

'' ఇస్తే బాగుండు కూచోబెట్టి మేపద్దూ కూతుర్ని నువ్విస్తావా?'' అని వచ్చా డాక్టర్ అన్నది కమలమ్మ.

''అన్నీ అబద్ధాలు డాక్టర్. నమ్మకండి. మొదట్నించీ డబ్బు యిబ్బందులే అత్తారింట్లో వున్నానా. డబ్బు దండుకు రమ్మని తన కొడుకును పంపేది. వాడెటో

పుడాయిస్తే తానే వచ్చేది. అత్తగారు యాత్ర కెళ్లింది. స్నానం చేయించి ఫో. మొగుడు డబ్బివ్వగానే యిస్తా'' అని మొత్తుకుంటుంటే వినక, రాగానే చేతబెట్టలేదని వెళ్లిపోయింది మమ్మీ. బంగారమంటి నా బిడ్డకు తెలియని వ్యాధి సోకి తల్లడిల్లుతుంటే యెప్పుడు ప్రాణం మీది కొస్తుందా అని చూస్తున్నట్టు మృత్యుంజయ స్తోత్రం వల్లిస్తూ ''అయిపోయింది. పోతున్నాడు'' అని ముసలి కన్నీళ్లు విడుస్తూ బిడ్డని తీసికెళ్లి, వీధరగు మీద వుంచింది మమ్మీ. నా బంగారు కొండని. కర్కోటకురాలు నా బిడ్డకింకా ప్రాణమున్నదంటే, ''అద్దె యిల్లు యింటివారు తిడతారు'' అని సముదాయించింది. నా బంగారు కొండే నన్ను సముదాయించాడు. నాలుగేళ్లు నిండి అయిదో యేడొచ్చిందంతే. యెన్ని మాటలు నేర్చాడు ''అమ్మా! యేడవ్వోకు. మరో అబ్బాయిని తెచ్చి నేనేననుకుని పెంచు. యేడవ్వోకు. నేను నాన్న దగ్గరికి పోతున్నానంతే యేడవ్వోకు. నువ్వూ వచ్చేస్తావు మా దగ్గరికి'' అని కన్నీరు తుడిచాడు డాక్టర్. చివరి వరకు తెలివిగానే వున్నాడు. మాట్లాడుతూనే వున్నాడు బంగారమంటి బిడ్డ. రూత్‌లెస్ అంటే మమ్మీయే'' అంతలో చాలా వర్రీ అవుతున్న ముఖం పెట్టింది గజలక్ష్మి. ''నీ జ్ఞాతిని రానీవోకు. నా చెల్లిని పోనీవోకు. జ్ఞాతికి కంట్లోను పాముకి పంట్లోను వుంటుంది విషం. మంచి పోషణలేక చెల్లి వీక్. కుడికాలు యీడుస్తూ నడుస్తున్నది. వేవిళ్లేమో. వాంతులు, పడిపోతున్నది. జ్వరంతో కాలేజీకి వెళ్లలేదు. నించుని ప్రయోగాలు చేయలేదు. చదవుమాన్పించు అని ఘోషపెడితే అరణ్యరోదనమైంది. డబ్బు చేతిలో మెరిసిందేమో. మమ్మీ కళ్లు మిలమిలలాడినై. చివరికి చేతులు కాలాయి. పట్టుకునేందుకు ఆకులు లేవు. చెల్లిని దూషించింది. చూడలేక గెంటుతుందేమోనని అడ్డు వెళ్లా ''నా ఐవేజు తీసుకో. కడుపుతో వున్నమ్మ కనద్దా?'' అని చెల్లిని ఓదార్చా. కర్కోటకుని డాటర్ మమ్మీ. నోరూ వాయీ

లేని పెళ్లాన్ని దెబ్బకు యముని వద్దకు పంపాడు కర్కోటకుడు. అబ్బో! మా గొప్ప జ్యోతిష్కుడు. మమ్మీ జాతకం చూడకపోయాడా కర్కోటకుడు?''.

''మమ్మీ! డాక్టరు సలహా నువ్వు పాటించాలి ఫో. నన్ను రెచ్చగొట్టకు. నీకే నష్టం అని అలిగాను. నోరు మూతబడదు. చాలా గుట్టు కక్కేస్తా'' అలా అంటూ వాకిట్లోకి నెట్టుకెళ్లింది తల్లిని.

డాక్టర్లు, మౌళీ లేచివెళ్లి గజలక్ష్మిని లోపలికి తెచ్చారు. మౌళి కమలమ్మను ఊరడించి అన్నాడు.

''నే భద్రంగా తెచ్చి యింటి వద్ద దింపుతా కమలమ్మ గారూ!''

''గుడ్ బై మౌళీ టైమైంది. బ్రేక్ ఫాస్ట్ కానిచ్చి ప్లేనందు కోవాలి. శక్తిమేరకు ప్రయత్నిస్తున్నావు. విష్ యు లక్''.

7

అనుకోకుండా హౌరా ఎక్స్‌ప్రెస్‌లో మిత్రులను కలుసుకున్న దయాసాగర్ సంతోషించాడు.

''నేను కాన్ఫరెన్సుకి అటెండయి వస్తున్నా మిత్రమా. రెండు రోజులే కాన్ఫరెన్సు. ప్రివెంటివ్ మెడిసిన్ అనే టాపిక్ మీద మాట్లాడారు ఫిజిషన్సు. బ్రెయిన్ డిసీజెస్ రీసెర్చి చేసినవారు సర్జన్స్ గూడా వచ్చారు. బాలెన్స్‌డ్ మైండ్ అనే దానిమీద మాట్లాడారు. శరీరాన్ని వలెనే మెదడునూ ఆరోగ్యంగా వుంచాలి. దానికి పాటించాల్సిన మెథడ్స్ మాట్లాడారు. కొంతమందికి చాలా చిన్న విషయానికే మతిబోతుంది. మళ్లా నిలదొక్కు కోటమెలా. చుట్టు వున్నవారూ సాయపడాలి'' అని మౌళి చెప్పుకెళ్లాడు.

''నీ నర్సింగ్ హోమ్ యెలా నడుస్తున్నది. నువ్వు లేనప్పుడు యెవరిని నియమించుతావు?'' దయాసాగర్ అడిగాడు.

'పని వత్తిడి వల్ల మీకు తెలియజేయటం పడలేదు. ఒక డాక్టరమ్మ నాగలక్ష్మి అని పేరు వచ్చింది. మానసిక వ్యాధులపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ తెచ్చుకున్నది. పేపర్లు రిలీజ్ చేసింది. కొంతమంది ఫ్రెండ్స్ అదే సబ్జక్టు వచ్చినవారితో కలిసి మాసపత్రిక స్థాపించి నడుపుతున్నది. హానరరీ డాక్టర్‌లాగా పనిచేస్తున్నది. నాగిని లాగే సన్నగా పొడుగ్గా నాజూగ్గా వుంటుంది. కళ్లల్లో వున్నదాకర్షణంతా. బెడిసి చేపలల్లే తిరుగుతాయి కనుపాపలు. మంచి స్నేహశీలి'' అన్నాడు కాళి.

''బాగానే వున్నది కవిత్వం. మనం దోవలో దిగి గజలక్ష్మిని చూసిపోదాం. బంగారమంటి మనిషి. రంగూ బంగారం రంగే. రాగూడని వ్యాధి ఎటాక్ చేసింది. ఆ మధ్య కొంత నిలకడగానే వుంటున్నదని వార్తలందినై. ఫాన్సీ షాపు పెట్టి బిజినెస్ రన్ చేస్తానన్నదిట తల్లితో. అది పడలేదుట. ఇంకా మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కొని కాన్వెంటులో ట్యూటరున్నాడని విని వెళ్లి నేర్చుకున్నదిట అవన్నీ చూసి వెళ్దాం. అలా వుండిపోయినా బాగుండు. నోటి ధాటి కందరూ దూరమైపోతే ఒంటరిదౌతుంది''.

''మదరే వుండనీయదని నా ఐడియా. గజలక్ష్మి వాగుతున్నప్పుడూ అదే వెల్లడైంది''.

'స్టేషన్ వచ్చేసింది. రండి. లగేజ్ చాలా వున్నదా. వాల్తేరు స్టేషన్ చాలా మారిందే. బాగా విస్తరించి అందంగా, కన్వీనియంట్‌గా కూడా వున్నదని చెప్పారు బంధువులు''.

''కూలీ అక్కర్లేదు. అంత లగేజ్ లేదు'' అంటూ దిగారు.

భోజనం వేళ అయింది. రెస్టారెంటుకెళ్లి యెయిర్ కండిషన్డ్ రూమ్‌లో కూచుని భోజనం కానిచ్చారు. అక్కడింకా మిత్రులు కలిశారు. రెండు దాటింది. కార్లలో యింటికెళ్లి రెస్టు తీసుకున్నారు. సాయంకాలం అదే రెస్టారెంటుకెళ్లి కాఫీ స్నాక్సు కానిచ్చారు. ఫోన్ చేసి తెలుసుకుని ప్రశాంతి నిలయం అనే నర్సింగ్‌హోమ్ కెళ్లారు. పొద్దూక వస్తున్నది.

ఇద్దరు నర్సెస్ మెట్లమీద నిలబడి వీరిని చూశారు. లోపలికి తీసికెళ్లారు. ఆయా, క్లీనర్ వీరిని చూసి దణ్ణం పెట్టారు. రంగుల యీకలున్న కర్రతో షోగ్గా క్లీన్ చేస్తున్నారు, కిటికీలు, సోఫాలు, టేబిల్స్, ఇతర వస్తువులు, బొమ్మలు, ఫోన్, టివి. గజలక్ష్మి నిలబడి యిటూ అటూ తిరుగుతూ ఎకార్డియన్ వాయిస్తున్నది. వీరిని చూసి నవ్వింది. ''కూచోండి'' అన్నది. సోఫాల్లో సుఖాసీనులైనారు.

''వైకల్యం తగ్గిందేమోనని చూడవచ్చారా?''

''లేదు గజలక్ష్మి! కొత్త మ్యూజికల్ యిన్‌స్ట్రుమెంట్సు నేర్చావని విన్నాము. విందామని వచ్చాము'' అన్నాడు డాక్టరు.

''చాలా రోజులైంది నిన్ను చూసి'' అన్నాడు దయాసాగర్.

''రోజులేం? యేళ్లు గడిచిపోలా. గజా! అనాలి చాలు చూశారుగా. యేనుగంత శరీరం పెంచాను యెందుకో తెలుసా?'' అని నవ్వింది. వాయించటం ఆపనూ లేదు.

''తెలియదు గజా! నువ్వే చెప్పు తెలుసుకుంటాము. యెంత శరీరం పెంచినా, లావణ్యం, తారుణ్యం, సహజ సౌందర్యం అలాగే వున్నాయి గజా!'' అన్నాడు గౌరీ నాథం.

''తరచూ వచ్చి చూడాలనే వుంటుంది గజా. విదేశం వెళ్లి వచ్చా. నీ స్టూడెంట్ లలిత అక్కడే వున్నది. అల్లుడక్కడ కంప్యూటర్ నేర్పే జాబ్ చేస్తున్నాడు. లలిత బేబీగల్‌ని డెలివర్ చేసిందనీ వచ్చి చూచిపొమ్మనీ ఫాక్సు పంపాడల్లుడు. వాళ్లమ్మ లేదైపాయె. అల్లునికీ తల్లిలేదు. వాళ్లిద్దరే మానేజ్ చేసుకున్నారుట. లలిత కంప్యూటర్ కోర్సు నేరుస్తున్నదట. ఖర్చులు పెట్టుకుంటాము రమ్మని ఫోన్ చేస్తే వెళ్లకతప్పలేదు. ఒక డాక్టర్ని కూడా సర్జరీ చూడమని నియమించి వెళ్లివచ్చా గజా. చెప్పు యెందుకు ఒళ్లు పెంచావు?'' దయాసాగర్ నవ్వుతూ అడిగాడు.

వాయిద్యం ఆపేసి వూరికెనే పట్టుకుని నవ్వుతూ అన్నది గజాలక్ష్మి ''నా సొమ్ము యెవరూ తినద్దు, పాడైపోతారు అది ముదనష్టపాస్తి అంటే నమ్మరు. పరమాన్నంలాగా తింటారు. సూది మందులు, టానిక్కులు, వైద్యునికి ఫీజు, చదువుకి ఫీజు, సంగీతానికి జీతం అన్నిటికీ వాడుకుంటుంటే అయిపోతుంది. యెవరూ లాగలేరు. తినాలని ''అది మంచి ఆలోచనకాదు గదా గజా! నిన్ను కనిబెట్టి వుండేవారు తింటే తప్పా?'' అన్నాడు మౌళి.

మొహం చిట్లించి, చేతులోని వాయిద్యం బల్లమీదుంచేసింది. ఒక చేయి నడుముకానించి, రెండో చేయి తిప్పుతూ అన్నది.

''అది ముదనష్టపాస్తి అనే నా మేనత్త మొగుడు దత్తు వెళ్లనని వాళ్ల అమ్మనాన్నల నెదిరించాడు. పెద్దలకు ఆస్తి పరాయిగాపోరాదని అభిలాష. తమ

సంతుకే సంక్రమించాలని ఆశ. దత్తమహోత్సవం చేసి, ఒడుగు చేసి, పెళ్లిగూడా ఆర్భాటంగా చేయించారు దత్తు అడిగిన వారి చేత. దత్తు అడిగినవాడు - అన్న కొడుకే. సగోత్రీకుడు. వాడికీ సంతు నహీ. అప్పారావు మామయ్యకి నా మేనత్తకీ సంతానం కలగలేదు. మామయ్య విలాస పురుషుడు. గ్రామ మునసబు. అత్తయ్య వేగులాగా మారి మామయ్యను రొట్టె కాల్చుకు తిన్నట్టు కాల్చుకు తిన్నది. ఆయన యెఫేర్సు పట్టించేది. అవినీతిపరుడని టముకువేసింది. మళ్లా దత్తు చేసుకోమని ఒత్తిడి వచ్చింది. ఆస్తివున్నది గదూ. మామయ్యకు ఒళ్లు దహించుకుపోయింది. ముచ్చటలేమీ లేవు. విరుగుడు కనిబెట్టాడు. దత్తేమో చేసుకున్నాడు అన్న కొడుకే మళ్లా. ఒడుగూ పెళ్లీ బాజా భజంత్రీలూ సరదాగా పూర్తి అయాక ఘటాశ్రాద్ధం పెట్టుకుని న్యుమానియా తెచ్చుకుని పూలరథమెక్కి స్వర్గానికి వెళ్లిపోయాడు అఘమేఘాలమీద. చచ్చి పగ తీర్చుకున్నాడు'' అని వూగిపోతూ అహహా! అని నవ్వింది గజలక్ష్మి.

''అంటే యేమిటి చేస్తారు గజా!''

''మీకు తెలియదా? వింతే. డిగ్రీలు తెచ్చుకుంటిరే. వెరీ సింపుల్. ఘటా శ్రద్ధ అనే సినిమా తీశారుగా. తనకు పుట్టగతులక్కర్లేదనీ, నీళ్లూ అక్కర్లేదనీ, బతికున్న వారికీ తనకే సంబంధం లేదనీ, మళ్లా తనకిష్టంలేని పని దత్తు చేశారనీ, ఆదత్తపుత్రుడు తనకు కర్మకాండలు, అంత్యక్రియలూ, తద్దినం చేయక్కర్లేదనీ, ఆ దత్తపుత్రుడు బతికి బట్టగడితే అదే తనకు ఆత్మశాంతినిస్తుందనీ, ఆత్మకు చావుపుట్టుకా లేవుగదండీ, మామయ్య నవ్వుతూ శాస్త్రీయంగా అన్నీ తనే చేసుకున్నాడు పండితుల సాయంతో. ఈ శరీరమనే ఘటము అంటే కుండకు తన కులగోత్రాలూ పెట్టి చూసి పగలగొట్టాడు. ఆ పెంకులు, సామాగ్రి

ప్రయాగలో కలిపేశాడు. తీసుకుపోయేవ్యాధి పరుగెత్తికొచ్చింది. దత్తపుత్రునికీ అంటే నా మొగుడికి, ఇన్‌క్యూరబుల్ డిసీజ్ వచ్చింది. మంచి ట్రీట్‌మెంటిచ్చాడు డాక్టరు భోగరాజు. ముదనష్టపాస్తి తింటేనే అలాటి వ్యాధి సోకింది. మరుసటేడు పదినెలలు గడిచినై అంతే, ఆ ముదనష్టపాస్తి నా బంగారు బిడ్డకు బ్లడ్ కాన్సర్ తెచ్చియిచ్చింది. దానిపేరూ సరిగా చెప్పలేకపోయాడు. మరో డాక్టర్ లివర్ వ్యాధి అన్నాడు. కాని కుదర్లా. తండ్రి దగ్గరికి పరుగెత్తుకుపోయాడు కొడుకు. గున్నయేనుగలాంటి ముద్దు బిడ్డ. జనముద్దయిన బిడ్డ పీనుగైనాడు. ఉతరవితానం పెరిగిపోయింది. బహుశా హరిశ్చంద్రునికి వరుణదేవుడిచ్చింది బ్లడ్ కాన్సరే. పొట్టపెరిగిపోయి యేమీ తినలేడు. తెలివీ ప్రేమా అలాగే వుంటాయి'' నవ్వుతూనే వున్నది గజలక్ష్మి. కన్నీరన్నా లేదు. కంటిన్యూ చేసింది.

''నా మేనత్త ఎక్స్‌పరిమెంట్ విత్ ట్రూత్ అని తనకు చెందిన నాలుగెకరాల మాగాణీ, దాన్ని భృతి అంటారు. యెరపెట్టి తనకు తిలలూ నీళ్లూ వదిలేవాడు గావాలని సగోత్రీకుని శాస్త్రీయంగా దత్త మహోత్సవం చేసి, ఒడుగూ పెళ్లీ చేసింది. అవి రెండూ విధిగా చేయాలి మరి మీకు తెలియదేమో. స్వంత మేనగోడలే కోడలు. అదీ రంభే. చదువుకున్నది. పేరు వనలక్ష్మి అహహ! అది ముదనష్టపాస్తి అని మరోసారి ఋజువైంది. సంతులేదు. ముదనష్టం సొమ్ము దత్తపుత్రునికి వంటబట్టలేదు. యూరిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చింది. వినాలని లేకపోయినా విన్నా''.

''వుద్యోగి అయినాడు. ఢాం. హరీమన్నాడు. మరొక రంభ విడో అయింది. పెళ్లి మాట తలపెట్టక, పెంపకం తలపెట్టక, నోములూ, వ్రతాలూ, యాత్రలూ అందుకుని, అనాథ శరణాలయం నడుపుతున్నది. అకామాపై చేస్తుందిట. గుండుకూడా కొట్టించుకున్నదేమో వనలక్ష్మి. నా మేనత్త

హతాశురాలై, వృద్ధు అయి, మళ్లా ట్రూత్‌తో ఎక్స్‌పరిమెంటు తలపెట్టక జన్మరాహిత్యం కోసం శ్రీశైల శిఖరం చూసి అక్కడే యముని వాహనం గిట్టల చప్పుడు విన్నదిట'' నవ్వుతూనే వున్నది.

'' ఇన్ని చెప్పగలిగి గజా, యింత హ్యూమరుండీ గజా, యిన్ని అర్థమౌతున్నా, రత్నంలాగా వున్న సోదరునెందుకు దూషిస్తావు? కూడని మాటలెందుకంటావు?'' గౌరీనాథం అడిగాడు.

''కాళ్లూ చేతులూ లేని పనికిరానివానిలాగా ఆ కూచుని తినటమేమిటీ? బ్రెయినుపయోగించి లక్షలార్జించవచ్చునే. ఇంటికొచ్చిన వారిని నొవ్వనాడటం, నా ఫ్రెండ్సుని దూషించి అవమానించటం మర్యాదా? రోషం పొడుచుకు రావాలనీ, యేదైనా జాబ్‌లో దూరాలనీ నా ఐడియా. ముగురాడుమైతిమి వగపేటికి జలకమాడ వచ్చిన చోటన్ అని ఒకామె మంచం అడ్డంపెట్టి పసుపు రాచుకోమని యిచ్చిందట''.

''మరి రెండో అనుజానెందుకు తూర్పారపడతావు గజా!''

వెనకటికో శుంఠ ''అరవై యేళ్లొచ్చి చదువుకోక నోట మట్టికోనా'' అన్నాడట. మంచి వుద్యోగం గౌరవమవ్వటం లేదని తూస్కరించి, డాక్టరేట్ తెచ్చుకుంటే మంచి జాబ్ మంచి గౌరతా వస్తుందని నైట్ క్లాసెస్‌కి అటెండౌతూ, భుక్తి యెలా? అంతగా అది చేతిలో పడ్డా వయస్సుమీరి యిదే జాబ్ చేయాల్సిరావచ్చు. రెంటికిం చెడిన రేవడు కావచ్చుని వార్నింగ్ అది''.

''మరి సోదరి మాటేమిటి యెవర్నీ మన్నించవా? ఓడ ఓడంటే అంతా ఓడేనా? లంకలోని వారంతా రాక్షసులేనా?'' అని నవ్వుతూ అడిగాడు

కథా నిలయం శ్రీకాకుళం 5249

గౌరీనాథం ''యెవరిలోనూ మంచికానరాదా?''

నాగలక్ష్మి వాచీ చూసుకుంది '' ఇవాల్టికి చాలు డాక్టర్! మెస్మరిజం ఆపేశాను. నేనింకో పేషంటుని వాళ్లింటి వద్ద చూడాలి'' అని లేచి నమస్తే చెప్పి వెళ్లిపోయింది.

అమ్మాయిలూ లేచి వెళ్లిపోయారు.

కమలమ్మ వచ్చి ఖాళీ కుర్చీ ఆక్రమించింది.

''నిన్ను బాగానే ఆడిస్తున్నారే గజం. వారు ఆడమన్నట్టే ఆడుతున్నావు. నేను నిన్నాడిస్తానని నిందవేస్తావందరెదుటా?''

''డాక్టర్! డబ్బిచ్చి పంపేయండి దయచేసి. నాకు నీరసం ఆవరించింది. ఆమెతో వాదించనూ లేను. వాదించి గెలవలేను'' అంటున్న గజలక్ష్మి కళ్లు పెద్దవై దీపాల కాంతిలో కళకళలాడినై.

''డబ్బు కంటబడనిదీ పోదు. ఘ్యూర్ థింగ్'' ''ఫాన్ గాలికి జుట్టు మొహం మీద పడి ఆడుతున్నది. నేను తెలివిగా సెలక్టుచేసుకున్నవాడితో పోనీక, చుప్పనాతి నా భవిష్యత్తు కడ్డుపడటమే గాక, వంచకి అయి, ఆ బేవకూఫ్ నా సిస్టర్కి టోకరా వేస్తుంటే ఎంకరేజ్ చేసిందా బేయిామాన్ని యీ నమక్ హరామ్. బహుశా డబ్బు కళ్లబడి వుండాలి. సిస్టర్ గాలిలో పెట్టిన దీపం బుడ్డీలాగా అయినా, యీ బద్మాష్ వుమన్ బుద్ధి మారలేదు. బ్లాక్‌మెయిల్ చేయాలని ట్రై చేసింది. గొప్ప హాస్యగాడు చాప్లిన్ని కూతురు తల్లీ బిచ్చగాడిని చేస్తే ఆయన జుట్టంతా తెల్లగా నెరిసింది. పాతికేళ్లే హాస్యగాడికప్పటికి. సిస్టర్కి హౌ టూ బ్లాక్ మెయిల్ నేర్పబోతే సిస్టర్ ధడుచుకుని యెటో పోయింది. వెతికి తెచ్చి దాని

జుట్టు తన చేతులో పెట్టుకున్నాదేగాని అప్పుడన్నా నాకు ఛాన్సు యిచ్చిందిగాదు మమ్మీ. నేనా బద్మాష్‌కి బుద్ధి చెప్పేదాన్ని. నాకు టోకరా వేయ్యలేదా ఫూల్. చాలా మందిని చూశా బేవకూఫీలను. మై విట్స్ ఆర్ షార్పర్ దేన్ హిజ్ విట్స్ అని చూపేదాన్ని అదే ప్రూవ్ చేయాలని సోదరినేడిపిస్తూ వాడి రియర్ కలర్స్ చెప్తుంటే నన్ను తప్పుగా అర్థం చేసుకున్నది సిస్టర్ ఫూల్. ప్లస్ కమలమ్మ మమ్మీనూ ''బాగా నవ్వుతూ, నిజం చూస్తే డాక్టర్ బిలీవిట్ ఆర్ నాట్ కమలమ్మ మమ్మీయే మెంటల్లీ రిటార్డెడ్ అంతే గాక సైకో కూడాను. డబ్బు చూడగానే ఎక్సైటై అంతా లాగేస్తుంది. పాపపుణ్యాలు లేవు. వున్నది డబ్బే''.

''అమ్మాయిలు వెళ్లిపోయారేం వినోదిస్తున్నావుగా'' గౌరీనాథం అడిగాడు.

''వాళ్లు అనలేనివీ చెప్పలేనివీ బైటబెడుతున్నది గజలక్ష్మి'' అని వెళ్లపోయారు. గజకి నయమైందని విని వచ్చారు అన్నాడు మౌళి.

కమలమ్మా లేచింది పమిట దిద్దుకున్నది.

డాక్టర్లూ లేచారు. ''మళ్లా వస్తాము'' అని వెళ్లబోయారు.

హిప్నోథెరపీ వైద్యుడెదురుగా వచ్చాడు. మౌళి ఆయన్ని లోపలకి తీసికెళ్లాడు. గజలక్ష్మి నవ్వుతూ సోఫాలో కూచున్నది. అంతా వెళ్లారు ''గుడ్ బై మౌళీ'' అన్నారు. కమలమ్మ వెళ్లిపోయింది.

వాల్తేరు స్టేషన్లో ఒకర్నొకరు చూశారు డాక్టర్ దయాసాగర్ డాక్టర్ నాగలక్ష్మి.

''హలో డాక్టర్! యెక్కడినించి వస్తున్నారు'' అన్నది నాగలక్ష్మి.

కూలీవాడు పెట్టె బెడ్డింగ్ నెత్తిన పెట్టుకుని సంచీ చేత్తో పట్టుకుని నిలబడి వున్నాడు.

''శుభోదయం డాక్టర్. మళ్లా కలుసుకోగలిగినందుకు సంతోషంగా వున్నది. వళ్లు చేయటం యిష్టం లేదాయేం అలాగే స్కెలిటన్‌లాగే వున్నారు'' అని చనువు వెల్లడిస్తూ హాస్యమాడాడు దయాసాగర్.

''పోదామా, ఆ బెంచ్ మీద కాసేపు కూచుందామా. మిసమిసలాడుతూ కంటపడగానే మగవాడు లూర్ చేస్తాడని, యీ శరీరాన్ని యిలాగే వుంచుతాను డాక్టర్. మగవాడిని తిరస్కరించలేనని భయం. లేదా అదొక బలహీనత. యెముకలు విరుగుతాయేమోనని దూరంగా నిలబడతాడు. యేదీ మీరు పెళ్లాడినట్టులేదే. సంతోషంగానే వున్నారు. పక్కన బ్యూటీ లేదు'' అని తానూ హాస్యాలాడింది డాక్టరమ్మ.

''కారులో పోతూ మాట్లాడుకుందాం. మా యింటికెళ్దాము. మరీ అంత నాజూకైతే యే డిసీజైనా యెటాక్ చేయచ్చని అన్నాను''. ఇద్దరూ నడవసాగారు. కూలీలూ వెంటవచ్చారు. గేటుదాటి బయటికొచ్చి టాక్సీ పట్టుకున్నాడు డాక్టరు. కూలీలు డిక్కీలో సామానుంచి కూలీ అందుకుని వెళ్లిపోయారు. ఇద్దరూ వెనకసీట్లో స్థిరపడ్డారు. గమ్యం చెప్పాడు డాక్టరు. డ్రైవరు ''యస్సర్'' అని కారు పోనిచ్చాడు.

''నన్ను గురించి ఆదుర్దా వెల్లడించినందుకు థాంక్సు డాక్టర్!''

''నాటెటాల్. యెక్కడికెళ్లారు. కాన్సరెన్సా. సెమినారా?'' దయాసాగర్ అడిగాడు.

''స్త్రీలకి మానసిక వ్యాధులెందుకొస్తున్నాయి యే వయస్సులో

వస్తున్నాయి. వారి కొరకు ప్రత్యేక ఆశ్రమం యేర్పాటు చేస్తే బాగుంటుందా? వృద్ధులకు ''శాంతి నివాసం'' అని కొత్తగా స్కీమ్ వచ్చింది. ఒకటి రెండు శాంతినివాసాలు నడుపుతున్నారప్పుడే. చూసి వచ్చాను. అమెరికాలో వృద్ధులకై వేరే ఫ్లాట్సు లేవదీసి ఎలాట్ చేస్తారు. వృద్ధాప్యపు పెన్షన్, పిల్లల జీతంలో కొంత భాగం భర్త ఎలాట్ చేసిన పెన్షన్ అందేట్టు చూస్తారు. సదుపాయంగా వుండి అన్నీ అందుబాటులో వుంటాయి. టి.వి., ఫోన్, ఫోన్ చేస్తే కారూ డ్రైవరూ వస్తారు. వైద్యమూ అందుతుంది. పిల్లలు వచ్చి చూసిపోవచ్చు. మనం గూడా ఆ స్కీమ్ ఫాలో అవుతున్నాము. అక్కడి డాక్టర్లు ప్రాక్టీసూ, వుద్యోగమే గాక సర్వే చేసి డాటా కలెక్ట్ చేసి పేపర్సు రిలీజ్ చేస్తారు. స్త్రీలకి బిపి యెందుకు యెప్పుడు వస్తుందీ, దానిని కంట్రోల్ చేయటం. అలాగే మనం స్త్రీలూ మానసిక రుగ్మతలు అని చర్చించటానికి ముంబాయిలో వేదిక యేర్పాటు చేశాము. అది కాగానే కలకత్తా వెళ్లి మిత్రులను, బంధువులను చూపి, హాస్పిటల్స్‌లోనూ నర్సింగ్‌హోమ్స్‌లోనూ నూతన పరికరాలు ఔషధాలూ, వాడకం, ఫలితాలు తెలుసుకుని వస్తున్నారు. చిన్నసైజు మీటింగ్ పెట్టుకున్నారు డాక్టర్లు. గజలక్ష్మి యెలా వున్నది? పరీక్షలకి అప్పియరౌతూనే వున్నదా? వ్యాధి వెనక బట్టిందా?'' అనడిగింది డాక్టరమ్మ.

''యేమో డాక్టర్! మీరడిగిందే అంతుబట్టటం లేదు. మౌళి వుత్తరం పడేస్తే తగ్గినట్టే అర్ధమైంది. వింత యేమనగా మా చిన్నమ్మమ్మ కూతురు పిన్ని అవుతుంది పేరు జగదాంబ. నాచిన్నప్పుడు నాతో ఆడేది. బాగా అలవాటు. పెద్దయాక నన్ను కన్సల్టు చేసేది. మందూ తీసుకునేది. ఆమెను చూసివద్దామని విజయవాడ వెళ్లాను. భర్తలేడామెకి. డాబా. రాత్రి వెళ్తే భోజనం పెట్టింది. డాబా మీద పడుకున్నా. చాపా పరుపూ దిండూ అంతే. చల్లగాలికి నిద్రపడుతున్నది.

కిందనించి తీయని గొంతు పాట వినిపించింది.

యేదో జంత్రీ వాయిద్యం తాంబూరాయేమో

హరిహీసుఖహై హరిః శాంతీ హరిహీ ప్రాణారామ్.

హరిహీ ప్రానారామ నిరంతర భజో మధురహరినామ్

హరిహీపాపసే ముక్త కరే జో భజనకరేహరిరాం

భజనకరే హరినామ నిరంతర, భజో మధుర హరినామ్

రెండో పాట

జీవన వల్లభా । తుమిగీన శరణం । దేవదీని శరణు

ప్రాణీనాం ప్రాణతుమి ప్రాణారమణా॥

బవర్నావ పరహేతో తుమిహే కర్ణధారీ

జై జై కృపామయా మహిమాతుమారీ

మరోటి

క్యాసుధాహై నామ్ మే తేరె అయి మేరే ప్రీతమ్ ప్యారే.

అమ్త సరోవర నామ్ హైతేరా సబ్‌కాహూ హరేహరె

బనాబనామె శ్యామల శ్యామల గిరిగిరిమె ఉన్నత ఉన్నత

సమీసవిలా చంచలచల గిరిగిరిమె ఉన్నత ఉన్నత

మంచినిద్రలోకి జారిపోయాను డాక్టర్. తెల్లారి కిందికి దిగివచ్చేప్పటికి యెదురుగా నవ్వుతూ గజలక్ష్మి కంటబడింది. యెంతో ఆశ్చర్యం. ఇక్కడెలా వున్నదీ. ఇక్కడ ప్రత్యక్షమౌతుందనుకోలేదే. షి యీజ్ ది లాస్ట్ పర్సన్ ఐ వాంట్ టు మీట్.

పిన్ని జగదాంబా వచ్చింది. కాలకృత్యాలూ ఫలహారం అయే లోపల నాకు మతిపోయిందేమో అనిపించింది. గజలక్ష్మే కాఫీ ఫలహారం చేసి సర్వ్ చేసింది. స్నానానికి వేడి నీళ్ల సబ్బు తువాలా అమర్చింది. ''రాత్రి బావుందా? ఫలహారం కాఫీ బావున్నాయా డాక్టర్. నా ముక్కు పట్టుకు నిటూ అటూ తిప్పుతూ గజా గజా అని పిలుస్తూ నవ్వితిరే డాక్టర్. ఇపుడిలా వెర్రి మొహం వేస్తే లాభమేమిటి? నటనా? నటించినా లాభించదు. అద్దె కడతాడు వచ్చి అని చెప్తానే వున్నా లాండ్ లేడీకి. నమ్మటం లేదు లాండ్ లేడీ?'' అన్నది.

పిన్ని రాగానే అడిగాను ''యెలా తెలుసీమె. ఇక్కడికెలా వచ్చిందీ?''

వాళ్లమ్మ తెచ్చి అద్దె మాటాడి దింపిపోయింది గజలక్ష్మిని.

మొదట రెండు నెలలు ఫస్టుకే తల్లి వచ్చి అద్దె చెల్లించి వెళ్లింది. తర్వాతామె కాశీయాత్ర చేసి వచ్చి జబ్బుపడింది. రాలేదు. గజలక్ష్మి చెల్లించలేదు. అప్పుడే ఆర్నెల్లు గడిచిపోయినై. ఇంటిపట్టున వుండదు. తల్లి దగ్గరా వుండదు. దుబారా చేస్తుంది గానీ అద్దె కట్టదు. పదిసార్లడిగితే నీ పేరు చెప్పి ఆ డాక్టరొచ్చి కడతాడని నవ్వింది. నువ్వు చేరదీశావేమో అని అనుకున్నాను. నీ దగ్గరికీ వెళ్లి వచ్చినట్లు తేలలేదు. అడిగితే వెళ్లి డబ్బు తీసుకురా అంటే వూళ్లో లేడు. విదేశం వెళ్లాడు డాక్టర్ వస్తాడు అని నవ్వుతుంది. పనీ చేసుకోదు. గిన్నెలూ శుభ్రం చేసుకోదు.

బట్టలూ వుతుక్కోదు. చిత్త చాంచల్యమేమోనని అనుమానం కలిగింది. ఆ వర్చస్సూ నవ్వూ చూసి అలా నమ్మలేం. మీ యిద్దరి సంగతీ నా కెందుగ్గానీ దయా అద్దె చెల్లించాల్సిందే వెళ్లే లోపల. ఇంటి మీది రాబడే నా కాధారం. పొలం లేదు. అమ్మేసి జబ్బుకి ఖర్చు చేశాం. గొంతులో కాన్సరొచ్చింది బాబాయికి. త్వరగా ముదిరింది'' అన్నది పిన్ని విచారంగా. ''నేను ప్రమదావనిలో పనిచేసి వారి నుండి ఒక వంద తెచ్చుకుంటాను.

''యెంత అద్దె?'' అనడిగితే ''మూడు వేలు'' అన్నది పిన్ని.

చెక్ రాసి పిన్నికందించి అన్నాడు డాక్టర్ ''వాళ్లమ్మకి లాయర్ నోటీసివ్వు పిన్నీ, నాకు గజలక్ష్మికి యే విధమైన బాంధవ్యం లేదు. కొన్నాళ్లు ట్రీట్‌మెంట్ తీసుకున్నదంతే. వాళ్లమ్మ వచ్చి అద్దె చెల్లించకపోయినా కూతుర్ని తీసికెళ్లకపోయినా లాయరు ద్వారా నోటీసివ్వు. కోర్టుదాకా వెళ్తుందీ వ్యవహారం అనాలి. గజలక్ష్మి డబ్బు తల్లి అధీనంలో వుంటుంది. అందులో కొంచెమిస్తుంది కూతురికి''. అని వచ్చేస్తుంటే డాక్టర్ ''నేనూ వస్తా తీసికెళ్లరూ?'' అని కూడా వచ్చింది వీధివరకు. ''మీ అమ్మను తెచ్చి, యిద్దర్నీ తీసికెళతా గజలక్ష్మి'' అని అటుగా వచ్చిన టాక్సీ ఆపి అందులో దూరి పోనీమన్నా. మీరు చెప్పాలి డాక్టర్! తగ్గిందా?''

విచారం వెల్లడయేట్టు నవ్వింది నాగలక్ష్మి డాక్టర్ ''బావున్నది. యేదో సామెత వుండాలే. మంచికిపోతే చెడు యెదురైందని.'' ఈ వూళ్లో వుంటున్నారా డాక్టర్'' అనడిగింది.

''అవును. ఆ యిల్లు అమ్మేసి ఆ డబ్బుతో యీ వూళ్లో మోడరన్ ఫ్లాట్ కొనుక్కున్నాను. మా అబ్బాయి జోగినాథం ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు.

అక్కడే మన ఆంధ్రాయే డాక్టరందితే పెళ్లాడాడు. విరజా కోడలి పేరు. వాడి ఆరోగ్యం దెబ్బతిన్నది రమ్మని రాస్తే వెళ్లాను. టెస్టులు చేయించి భయంలేదని చెప్పి డయట్ చూడమన్నాను. తూకం పడిపోతున్నది. జాబ్‌కి అటెండ్‌కాలేక పోతున్నాడు. విరజాకి తీరికలేదు. ఇద్దరు బిడ్డలు. పనివాళ్లను నమ్మదు. కొసవెర్రి వున్నదేమోననుకున్నాను'' అని నవ్వాడు డాక్టర్ దయాసాగర్.

''మీకు లేదూ? రెండో ఆమెను తెస్తే ఛిద్రం తెచ్చి పెడుతుందనీ సింగిల్ లైఫ్ లీడ్ చేస్తూ బిడ్డల్ని సాకారు. విదేశంలో వున్న సుజాత ఫోన్ చేస్తుందా? పిల్లలా? జాబ్ చేస్తున్నదా? తక్కిన పిల్లలిద్దరూ గూడా మిమ్మల్ని వదిలి స్టేట్స్‌కి వెళ్లారని విన్నాను. మీ ప్రాక్టీస్ యేంచేశారు?''

''థాంక్స్ డాక్టర్ యింటరెస్టు వెల్లడించారు. డాక్టరే కొన్నాడు. తానే సర్జరీ రన్ చేసుకుంటాడుట. చిన్న మెడికల్ హాల్ గూడా ఓపెన్ చేశాడు. ఆ డాక్టరు ద్వారానే విని గజలక్ష్మి వచ్చి విందిస్తా రమ్మన్నది. ఇద్దర్నీ పిలిస్తే వెళ్లాం. యెమ్మే కాగానే బాంక్‌లో వుద్యోగం తెచ్చుకుంటానన్నది. తానే వంట చేసి సర్వ్ చేసింది. రెస్టారెంటులో విందులాగా యిచ్చింది విందు. నవ్వుతూ అన్నా ''వయస్సు మీరిందనరా గజా!'' ''నేనింకా అందంగానే వున్నా డాక్టర్. కంప్యూటర్ క్లాసెస్‌కి అటెండౌతున్నా. నేనోటి కొనుక్కుంటా. నా సొమ్ము నాకే చెందాలన్నానా మరి. ఇమెయిల్ పంపుతా. పంపమని వస్తే ఛార్జ్ చేస్తా. ఫాక్స్ మెషీను కొంటా. దాన్ని యూజ్ చేయటం నేర్చాను. సులభమే. దాని మీదా రాబడి వస్తుంది''.

''సంగీతం నేర్పవా గజా!'' అన్నాను. ''నేర్పను డాక్టర్ సంగీతం పంతులమ్మ అని పేరు పెడతారు. మీకు వినిపిస్తా మళ్లా యెప్పుడు కలుసుకుంటామో'' అన్నది విచారంగా. విందు తరవాత సోఫాల్లో కూచోమని తాను కింద చాపవేసి కూచుని

వేణువు తెచ్చి, మా కిద్దరికీ తెలిసిన కృతులు, కీర్తనలు చెప్పమని వినిపించింది. అద్భుతం. తన్మయిలమై విన్నాము. టైం మరిచాము. ఎ గ్రేట్ సోల్ ఈజ్ ట్రాప్డ్ ఇన్ దట్ బ్యూటిఫుల్ బాడీ అనుకున్నాను డాక్టర్. మీకు వీలైతే చెప్పండి చూసొద్దాం గజలక్ష్మిని. నా యిల్లు ప్రాక్టీసు కొన్న డాక్టరు నా కింకా కొంత బాకీ వున్నాడు. ఓసారి రమ్మని ఫోన్ చేశాడు'' ఇదుగో యిల్లు వచ్చేసింది'' అన్నాడు దయాసాగర్.

''తప్పక వెళ్లి చూసొద్దాం డాక్టర్! బీచ్‌కి దగ్గర్లో వున్నారే. రోజూ చల్లగాలికి అలా తిరిగి రావచ్చు. మరో భాగం అమ్మకానికుంటే చెప్పండి. నేనూ కొనుక్కుంటా''.

''అలాగే'' అంటూ దిగాడు దయాసాగర్. డ్రైవర్ డిక్కీ తీయగానే లగేజ్ అందుకున్నారిద్దరూ. బాడుగ అందుకుని డ్రైవర్ సెల్యూట్ కొట్టి కారు తోలుకు పోయాడు.

9

మొదట మౌళి నర్సింగ్ హోమ్ కెళ్లారు. మౌళి సంతోషించి సాదరంగా లోపలి కాహ్వానించాడు.

''కూచొండిద్దరూ. గజలక్ష్మి తానే అడ్మిట్ అయిందిగానీ తగ్గిందని ప్రూవ్ చేసి డిశ్చార్జ్ చేయించుకుని వెళ్లిపోయింది. నేనూ వస్తా. కలిసి వెళ్దాం. ఇంకా మన మిత్రులకి ఫోన్ చేస్తా వారూ వస్తారేమో. డ్రింక్స్ తీసుకొండి'' అని యెదుట వుంచాడు.

''వాళ్లూ అప్పుడప్పుడు ఫోన్ చేసి గజలక్ష్మిని గురించి అడుగుతూనే వున్నారు'' అని లేచాడు మౌళి.

''నర్సింగ్ హోమ్ బాగా రన్నవుతున్నదా డాక్టర్'' అనడిగింది నాగలక్ష్మి. డ్రింక్ అందుకున్నది.

నిలబడ్డాడు మౌళి. నవ్వుతూ చూశాడు.

''బాగా అంటే మీ వుద్దేశం? వైకల్యం చెందిన వారు బాగా వృద్ధిజెందారా అనా''

''కాస్తో కూస్తో అందరికీ వుంటుందండీ. మీకు నెప్పియెందుకూ? వేదాంతం, సంగీతం, వైద్యం కాస్తో కూస్తో ప్రతీ మనిషికీ వచ్చే వుంటుందిట. అలాగే వైకల్యమూనూ'' అని నవ్వింది డాక్టరమ్మ. ''మంచి ఫలితాలు చూస్తున్నారా అని నా ప్రశ్న కర్థం?'' అన్నది.

''మంచి ఫలితం అంటే యేమిటీ? నార్మల్సీకి తెప్పించి పంపేసినా యెవరి మధ్య వుంటున్నారో ఆ బంధువులు గూడా సహజగుణాలు దాచి ఫార్మల్‌గా వుండాలి. సాధారణంగా అలా వుండరు. ఒక ఘనవైద్యుడు, ''రాయ పిల్లా'' అనే ఔషధం కనిబెట్టి ట్రీట్ చేసి నయం చేశాడు. చాలాయేళ్ల క్రితం కాని ఆజన్మ పచ్ఛం, ముని వృత్తి, నిగ్రహం, దైవభక్తి, మెడిటేషన్, రెగ్యులర్ హాబిట్స్ లేకపోతే, పాటించకపోతే కథ మొదటికొస్తుంది. ఆయన నర్సింగ్ హోమ్‌లోనే వుంటే ఖర్చులిచ్చుకోవాలి. గజలక్ష్మికీ తగ్గుతుంది. మదరే డీసెన్సీ చూపక కథ మొదటికి తెస్తుంది. నాకలా అర్థమైంది సుమండీ''.

''ఆమె దృష్టి అంతా డబ్బు మీదుంటుంది. గజలక్ష్మి అది వదలకుండా

పోరాడుతుంది. పోరాటం డబ్బు విషయంలో. ఆ డబ్బు చెయ్యిజారిపోకుండా పోరాడుతుండగానే వికలమైంది గజా. కొంత హెరిడిటరీ. నేనవన్నీ బ్లంట్‌గా కమలమ్మతో అనలేదు సుమండీ. ఓ వేళ మంచిగా సలహా యిస్తున్నట్లన్నా''

''మరెట్లా. కూచోబెట్టి మేపాలా. పనీ అందుకోదు. జాబూ మానేసింది. దాని ఆస్తి నాకు చెందేట్లు వ్రాయించి, దాన్ని తీసుకెళ్లి నువ్వు ముద్దుగా పెంచుకో. అంటుందండి. అంటుందేమిటి ప్రాక్టికల్‌గా అన్నది''.

## 10

రెండు మూడు నర్సింగ్ హోమ్‌లకి ఫోన్ చేశారు. తగ్గిందని తానే చెప్పి బిల్ చెల్లించి వెళ్లిపోయింది గజలక్ష్మి అని జవాబొచ్చింది. మౌళి, దయాసాగర్ నిరాశ పడలేదు.

మౌళి, ''వాళ్లింటికే పోయి చూసి వద్దాం. ఇంతదూరమొచ్చి చూడకుండా పోరాదు'' అని కార్లు మళ్లించి తోలుకెళ్లాడందరినీ.

హాలులో ఒకవైపుగా కిటికీ పక్కగా కుర్చీలో కూచుని తొక్కుడు హార్మనీ వాయిస్తున్నది గజలక్ష్మి. లైటు వెలుగుతున్నది. బంధువులు గోడవారగా కుర్చీలలో సుఖాసీనులై పత్రికలు తిరగేస్తున్నారు.

లోపలికొచ్చేవారిని గజలక్ష్మి చూసింది. కారు చప్పుడూ వినబడింది. కాని కూచున్నచోటునించి లేవకుండానే ఆహ్వానించింది. తడితల ఆరుతూ జుట్టుగాలికి కదులుతున్నది. వాయిల్ చీరా రవికా నగలేం లేవు. మెడకి రెండువేపులా చిక్కని జుట్టు బుజాల మీదికి పడుతున్నది.

''రండి. రండి. నన్ను చూడటానికేనా వచ్చారు? మా మమ్మీని

చూడటానికా? తనకోసమే వస్తున్నారనే యిల్యూజన్లో వుంటుంది మమ్మీ. తనలో మోహకత వున్నదనుకుంటుంది. యెవడన్నా కామదృష్టితో కన్నెత్తి చూస్తే దమయంతి కోయవానిని భస్మీపటలం చేసినట్టు చేశానని అరుస్తూ యాక్షన్ గూడా చేస్తుంది. షూటింగ్ చూడటానికి స్టుడియో కొచ్చిన ఆడియన్సల్లే వున్నారు. కూచొండందరూ. ఈ డబుల్ రీడ్స్ హార్మోనియం నాది గాదు. చాలా పాతది. హెల్తాఫీసరు సోమయ్య తిరుపతి వెళ్తూ తిరుక్షవరం మన్నయతి అన్న సామెతగా ఫామిలీతో సహా వెళ్తూ, వాడకపోతే బెల్లోస్‌లో పురుగులు చేరుతాయి. పాడై పోతుంది. మీరు వాడుతూ వుండండి'' అని తెచ్చి యిక్కడుంచి వెళ్లాడు. నేను మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్లు వాడగలనని తెలుసాయనకి. బుల్ బుల్ మీదే సామజ వరగమనా, యిందెందు వచ్చితివిరా, విడజాలదురా నా మనసు వినరాదా అనేవి వాయిస్తే విని 'అద్భుతం' అన్నాడు. ఆశ్చర్యపోయాడు బీహారి అయినా సంగీతంలో అభిరుచి వున్నది. బంగారము వంటి కోమటి సంగీతము చేత చిక్కి బేరసారములుడిగెన్'' అని పద్యం చదివితే మనసారా నవ్వాడు. చదరంగం ఆడతాడు. తాను సివిలైజ్డ్‌పర్సన్ననీ మంచి కల్చరున్నదనీ యెదుటివారనుకోవాలని ఆయాసపడతాడు శ్రేష్టి'' అలా అంటూ వాయిస్తూ మధ్య మధ్య పాడుతూ అభినయంగూడా కానిచ్చింది గజలక్ష్మి.

''తత్తరపడనేల తాళుతాళురాసామి అత్తింటిదానరా''

''మధురానగరిలో చల్లనమ్మబోనూ చేయివిడుము కృష్ణా

మాపటివేళకు తప్పక వచ్చెదా గట్టిగ కొంగూ పట్టకూ కృష్ణా॥

రోమాన్సే ఆనందమిస్తుంది. జానపద గేయాల్లో రోమాన్సు బాగుంటుంది'' అలాంటిలాంటి దాన్ని నేను కాని మేస్త్రిరో అర్ధరూపాయ్ డబ్బులకు రాను

మేస్త్రీరీ''. ఓబులేశుని కొండల నడుమీ ... గడ్డీ కోసెదానా బంచె గుడ్డా బల్లె గుడేమే హరి ఓబులేశా. హరి ఓబులేశా కాళింది కిణిణి బంచె దీసీ పంచెపరువావే గిద్దెలగిరీ కొండల నడుమా యెద్దుల కాసే ముద్దులమరిదీ దాపటెద్దుకు దప్పికాయెనోయ్ । కాళింది కిణికిణి।

''మురలీ మ్రోయించరా। అది నా మదిలో సుధానదియై ప్రవహించెరా। సదయా వినిపించరా । మదమూ కలిగించరా ''

పటుతర కుచయుగమో హోద్భుటసాగరమున మునుగుటయా। నిటుల పటుతర స్ఫుట బ్రహ్మపది సొక్కుటయా, అటా యిటా!'' మల్లె వాసనలతో మరి మరి తాకేవు। శ్రీమతీ యెచటివే యీ వాసనలని యడుగ యేమి చెప్పుదు వారికో మనోహర నాథ'' నన్నిడిచి పెట్టెల్లినాడే నా రాజు మొన్నతిరిగొస్తనన్నాడే రాజు, నీలు తేబోతుంటే, నీతోడె ఓలమ్మి। నా యెనక యెవరోను నవ్వినట్టుంటాది । చల్లన్ని యెన్నెట్లో చాపేసి కూర్కుకుంటే ఒట్టమ్మి ఒల్లంత ఉలికులికి పడతాది''.

అనాటి నా వోడు సెందురుడా। అలిగి రాలేదోయి సెందురుడా।

యెంకి మనమిద్దరమె యెవ్వరొద్దన్నాడు। గాలికైనా గాని కౌగిలీ నన్నాడు'' మనోజ్ఞంగా పాడుతున్న గజలక్ష్మిని చూశారు.

''తగ్గి నార్మల్సీకి వచ్చినట్టున్నదే. మొహం కెంపు రంగులో లేక తేటగా వున్నది. కళ్లల్లో మెరుపు లేదు. కాని రంగుమారినై పాపలు'' అనుకున్నాడు రంగనాథం. నాగలక్ష్మి మెస్మరైజ్ చేసిందెమో అనుకున్నాడు దయాసాగర్.

''డయటీ చూసుకుంటూ యోగా క్లాసెస్‌కి యెటెండౌతున్నదేమో''.

''శ్రీరామచంద్ర కృపాళు। భజుమన।'' అని పాడుతూ తల్లి వంక చూసి ''వాళ్లకిన్ని ఛిప్స్ పెట్టి, బాదంకీర్ కప్పుల్లో పోసి యియ్యి'' అని ఆర్డర్ వేసింది గజలక్ష్మి.

తల్లి కమలమ్మ లేచింది. కొడుకు నాగేంద్ర వారించాడు.

''కూచో. అవసరం లేదు. వారు విందు కానిచ్చి వచ్చినవారే''.

తీవ్రంగా చూసి, వాయిద్యం ముందునించి లేచి వచ్చింది. గజలక్ష్మి తానే ట్రేల్లో పెట్టి తెచ్చి వారెదట వుంచింది.

''తలలు బోడులైన తలపులు బోడురా।'' అని పాడుతూ తల్లి వంక చూసి నవ్వుతూ, '' ఇంటికొచ్చిన అతిథుల కింత యేమైనా సర్వ్‌చేస్తే నీ డిగ్నిటీ పోతుందా? నాకింత రుచిగా వండిపెట్టబుద్ధిగాదూ. కాకుల్ని గొట్టి గద్దలకేస్తావేం? డాటర్స్‌ని లూట్ చేసి సన్సుని బ్రింగప్ చేస్తావేం? బ్లౌజుని కాశీలో వదిలిపెట్టింది ఫ్రెండ్స్! త్రికోణాకార తెల్లకిరీటం ధరించింది మమ్మీ- స్టిల్ గ్రేట్ బ్యూటీననుకుంటుంది మమ్మీ. మొన్నీ మధ్యే కాశీసమారాధన చేసి నా బాంక్ బేలన్స్‌లో పెద్ద బొక్క పెట్టింది మమ్మీ. చీకటి వ్యాపారం, నల్లబజారు యిష్టంమేం? లేడీ కాబూలీ వాలా. ''అంటూ పేలుతున్న గజలక్ష్మికి నాగేంద్ర బ్రేక్ వేశాడు. ''నేను గద్దను గాను. నేనేమీ సోమరినీ గాను కూచునీ తినటం లేదు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పేలు. స్త్రీలు అబలలు, ధవుడు లేడు ఒంటరిగా వుంటున్నారు. రక్షణగా తప్పక మగవాడుండి తీరవలెను. తేలిగ్గా వంచించి బురదలోకి లాగే దగుల్బాజీలు వస్తూ వుంటారు యేదో మిషపెట్టి. స్త్రీల గౌరవమర్యాదా కాపాడాలి. రంభకే తప్పలేదు. రావణుడు పట్టాడు''.

కమలమ్మ తలతాటించి, మూతి విరిచి, లేచి నిలబడి కొంగుదులిపి సరిగా వేసుకున్నది. ''యేమిటంటున్నావు. మతిలేనట్లు నటిస్తూ, సోమరివై, చేతిలోని మంచి ఆధారానికి తిలోదకాలిచ్చి, పరుగెత్తి మటుమాయమైతే వెతికి తెచ్చి కాపాడుకున్నది నేను. మతిపోయిందని విని నీ అత్తారు నీ నవ్వు చూసి గ్రహించి నేర్పుగా అంతా లాగేసి తరిమితే, వారిని కోర్టుకీడ్చి, నోట్లో గడ్డి పెట్టించింది నేను. నీకు విశ్వాసమేదీ. పళ్లెం నిండా అన్నీ తోడిముందుంచితే ఒక తన్ను తన్నితివే. నేలపాలైంది అన్నం, పెరుగు నా నెత్తిన పోశావు. తెగులే అది. నీ సొమ్మా! మేం తింటుంటే యివన్నీ యెలా కొన్నా? చూశారా డాక్టర్! ఈ మధ్యే కెమేరా కొన్నది. పొటోగ్రఫీ వచ్చుట. పోటీకి పంపుతుందిట. కంప్యూటర్ట. అదేమిటో తెలియదు. డబ్బు కట్టింది. క్లాసెస్‌కి వెళ్లాలని పారిపోతుంది పని అందుకోకుండా. తన వెంట తోడు రావద్దన్నది'' అని మెటికలు విరిచింది కూతురి మొహాన కమలమ్మ.

''రావచ్చు. బుద్ధిగా వుంటారా నీ ముద్దుల సన్సు? యేం చేస్తారో నువ్వు చూశావా? తాను చాలా మేధావినని ఇంటలెక్చువల్స్‌తో సంభాషిస్తాడు. వాళ్లకు తలపట్టి, ''ఒక్కతెవు రారాదూ గజా! మేమేమన్నా చూస్తామనా మేధావిని తోడు తెచ్చుకుంటావు? యెంత రంభవైనా యింత మందెదుట యేం చేస్తాము? స్త్రీలు వున్నారే. వారు నీ పక్షమే'' అని గేలి చేస్తారు.

''రేపటినించీ నువ్వురా తోడు మమ్మీ. నువ్వూ నీ గుండు త్రికోణాకార కిరీటం ముక్కు పీక్కుంటూ గూడెగరేస్తూ వ్యవహారం యెత్తుదువుగాని'' అని పకపక నవ్వింది గజలక్ష్మి.

''అవును వ్యవహర్తను గనుకనే, నీకు చెందాల్సింది చెందేట్టు చేసి రక్షణ

గూడా యిస్తున్నాను. మేనమామ పోలికా మేనత్త చాలికీ వచ్చింది నీకు. మేనత్తలాగే అన్నీ కోల్పోయి దిక్కులేని పక్షివైతే అండదండవుండేట్టు చేశాను'' అని యీసడించి కూతురు మొహాన చేయి తిప్పింది కమలమ్మ.

''అబ్బో! నీ వ్యవహారం యెవరికి తెలియదుటా! నేను లవ్వర్ని స్వాధీనం చేసుకోవాలని చూస్తుంటే, సాయపడకపోగా, అడ్డుపడి నీతి అనీ మతమని ఆచారమని వల్లించి, తీరా ఆ లవ్వరు నీకు మనీ చూపగానే, నీతీ మతం ఆచారం హుష్కాకీ. వాడు నీకు తగ్గ తాళం. నా సిస్టర్ని ఆపదలోకీడ్చాడు. ఆపలేకపోయావేం ఆపదని? నాకే ఛాన్సు యిచ్చి వుంటే నా సిస్టర్ చదువు చెట్టెక్కేది గాదు. మేక మేక పిల్లకి పొడవటం నేర్పినట్టు బ్లాక్‌మెయిల్ చేయాలని బోధిస్తే, భయపడి పారిపోయింది సిస్టర్. దాన్ని వెతికి, తప్పు చేశావని భయపెడ్తూ స్వంత బిడ్డని బ్లాక్ మెయిల్ చేశావు. డబ్బు గుంజటానికి వేసెండ్ మీన్స్ కనిబెడతావు. అదే నీతి'' అని రెచ్చిపోయింది గజలక్ష్మి.

కమలమ్మ వుక్రోషపడింది.

''డబ్బు విషయంలో గజలక్ష్మికి మతిపోలేదు డాక్టర్. పిన్నా పెద్దా గమనించక కడిగేస్తున్నది మతిభ్రష్టు. టైప్ ఇన్‌సిట్యూట్ నడుపుతానని మెషీన్లుకొని వాటిని విరిచింది. వాటినమ్మి వదిలించి డబ్బు చేసేప్పటికి హతమారింది. గ్రామఫోన్ కొని దాని స్ప్రింగు విరగ్గొట్టింది. ఆరు సార్లే కీ యివ్వాలని చెప్పాడు కొట్టువాడు. పదిసార్లు తిప్పింది. ఠుఫ్‌మని వైర్ తెగింది. మళ్లా ఒక మెకానిక్‌ని పట్టుకుని సగంధరకమ్మి డబ్బు చేశాము డాక్టర్. విశ్వాసముందా యేనుగంత అయింది పేరుకి తగ్గట్టు. తిండీ అంతే'' అని తనను తాను సంబాళించుకోక గజలక్ష్మి లాగే వున్మాదించినట్టు అరిచింది. '' ఇంక నీ చేతికి చిల్లి గవ్వరాదు.

నువ్వు ముష్టెత్తుకోవాల్సిందే. అప్పులు చేశావు తెలియదేమో. ఇంటి అద్దె చెల్లించలేదేనాడూ. అవన్నీ తేదీలతో సహా, లాయరు సాక్షిగా కోర్టువారికీ, పోలీసు శాఖకీ గూడా, రిజిష్టర్ ఉత్తరాల ద్వారా తెలియజేసి దినపత్రికలో నీ చిత్రంతో సహా వేయించాను. ఈమె చేసే అప్పులకీ, పాడుపన్లకీ మేము బాధ్యులము కాము. పత్రికా ముఖముగా తెలియజేయుటమైనది. స్థిరాస్తి చరాస్తులు లేవీమెకు. వుద్యోగి కాదు''.

గజలక్ష్మి కళ్లు పెద్దవై తళతళలాడినై. మొహంలో రక్తం గూడు కట్టింది. ''నేను జైలుకి పోవటానికి రెడీ. వురికంబమెక్కేందుకు రెడీ. ఉరితాడు మెడకి నేనే పెట్టుకుంటా''. అలా అంటూ తల్లి మెడ రెండు చేతులతో పట్టుకుని వేళ్ల బిగించిసాగింది. నాగేంద్ర లేచి వచ్చి విడిపించాలని చూచి విఫలుడై, గజలక్ష్మి జుట్టు పట్టుకు లాగుతూ తన్నుతున్నాడు.

నాగలక్ష్మి మెస్మరైజ్ చేసింది. గజలక్ష్మి వేళ్లు వదులైనై. పట్టు సడలింది. నాగేంద్ర జుట్టు లాగుతుండటం వల్ల వెనక్కు పడింది. మౌళి లేచి వెళ్లి కమలమ్మను కూచోబెట్టి గొంతు మీద రాయసాగాడు. మంచినీళ్లు తెచ్చి తాగించి వీపుమీద రాచాడు.

''గొంతు పిసకనీయండి డాక్టర్! విడిపించారెందుకూ? దీన్ని కాపాడలేక ఛస్తున్నా. యెక్కడికి పోతై పోలికలు? మాతామహుని పోలిక. కూతురు చేతిలోచావాలనున్నదేమో నా మొహాన. మీ అందరెదుటా నన్నంతగా కడిగిందిగానీ డాక్టర్, దానికీ ధనాశ వున్నది. డబ్బున్నవాడూరికే అందుతాడా, చేతులో వున్నదీ కోల్పోతావు అని తిట్టి మెడబట్టుకు వీధిలోకి గెంటింది'' అని చెప్తూ భోరుమని యేడ్చి చేతులు మొహానుంచుకున్నది కమలమ్మ. అటు చూస్తే నేలమీద స్థిరంగా

కూచుని వున్న గజలక్ష్మి నవ్వుతున్నది.

''మమ్మీ యిప్పుడప్పుడే చావదులెండి డాక్టర్. మమ్మీ జాతకం చదివాను. తొంభై యేడేళ్లు జీవిస్తుంది రాబందు లాగా పీక్కు తింటూ. రాబందుతో యెందుకు పోల్చానంటే డాక్టర్, రాబందు చచ్చిన ప్రాణులనూ పీక్కు తింటుంది. గద్దేమో బతికున్న ప్రాణులను తన్నుకు పోయి చంపి పీక్కుతింటుంది. మీరంతా పొండి. చూశారుగా నాకు నయంగాలేదు. భ్రమ కలుగుతుందంతే'' అన్నది.

''పోతాంలేగానీ గజా! యీ ముఖచిత్రం యెవరిదీ? చాలా బావున్నాడే. మీ బంధువా?'' అని మాటమార్చాడు దయాసాగర్.

గజలక్ష్మి మొహం సడలనిచ్చి, వికసించి, తెల్లబడింది.

''వాడా డాక్టర్! ఆల్‌దట్ గ్లిట్టర్స్ యీజ్ నాట్ గోల్డ్ అని ప్రూవ్ చేశాడు. వాడితో రోమాన్సు వెలిగించా కొన్నాళ్లు. వాడి యూనిఫామ్ చూసి, వాడి వంటి రంగు చూసీ భ్రమిసిపోయినా డాక్టర్. ఈ స్వార్థపరుల బారినుంచి నన్ను దూరంగా తీసికెళ్లగలడనుకున్నా. అదే భ్రమ. పెళ్లి అనే రెండక్షరాలు పలికితేనే వెలవెలపోయాడా మగధీరుడు. సారంగునిలాగా మాట్లాడుతాడు. పోనీలే వేడుకలూ తంతూ వద్దులే ఇలోప్ అవుదామన్నా''.

''యెలా గజా! ఆర్మీలో వున్నా. నిన్నెక్కడ దాచనూ? కాపలా పెట్టాలి నీకు. వచ్చి భద్రంగా వున్నావా లేదా చూడాలి. వీలుగాదు. నువేం చేయాలంటే, నీ ఐవేజు వాడుకుంటూ, వుద్యోగం చేసుకుంటూ వుండు మీ వాళ్ల అండన వుంటే రక్షణ వుంటుంది. నేను శలవుమీద వచ్చినప్పుడు విఠౌట్ ఫెయిల్ రోమాన్సు వెలిగిస్తా. రిటైరై వచ్చాక మనిద్దరం వేరే వుందాము'' అన్నాడు.

''ఏడ్చినట్టున్నది సజెషన్. రక్షకులే భక్షకులైనారని మొత్తుకుంటే రోమాన్సు వెలిగేస్తే, కంచెయే చేను మేసిన గలదె దిక్కు అన్నట్లు యిక్కడే పాతుకుని వుండి దోపిడీకి గురికా అన్నాడు. వాడింక రాలేదు. నేను రమ్మని అడగలేదు. ఆ చిత్రం నేనే పిన్‌హోల్ కెమెరా ఆగ్ఫాతో తీశా. తరవాత ఎన్‌లార్జ్ చేయించా'' అని నవ్వింది గజలక్ష్మి.

## 11

హోటల్లో మిత్రుడు గౌరీనాథం కంటబడితే దయాసాగర్ సంతోషించి తానే వెళ్లి బుజం మీద చెయ్యివేసి పలకరించాడు.

''మిత్రమా, నిన్ను చూడగలిగాను. నేడు శుభదినం యేం పనిమీద వచ్చావు నాగపూర్?''

''చాలా సంతోషం డాక్టర్! చాలాకాలం తరవాత కలుసుకున్నాం మళ్లా. నా హాఫ్ బ్రదర్‌కి యిద్దరు కూతుళ్లు. వాళ్లిద్దరి చేతా మొదటినించీ ప్రైవేట్‌గా పరీక్షలకప్పియరయే పద్ధతి పెట్టారు తల్లిదండ్రులు. తల్లి సౌమిని భాగ్యశాలి. అపురూపంగా పెంచింది. సంగీతం, ఒడిస్సీ నేర్పించింది. నా బ్రదర్ ఇంజనీర్. భార్యతో భిన్నాభిప్రాయం లేదు. పిల్లలిద్దరిదీ యింగ్లీష్ మీడియం. మొదటినించీ నాగపూర్ యూనివర్శిటీయే అచ్చి వచ్చిందిట పిల్లలకి. ఇప్పుడు యెమ్మేకి అప్పియర్ అయారిద్దరూ. సౌమినికి టిబి తాకింది. ఒక ఛెస్ట్ డిసీజ్ స్పెషలిస్టు నయం చేశాడు. ఇప్పుడే కోలుకుంటున్నది సౌమిని. బ్రదర్‌కి సెలవులేదు. పరీక్షలు వ్రాయించి తెమ్మని పురమాయించారు. ఖర్చులన్నీ వారివే. ఈ వూళ్లో నా ఫ్రెండున్నాడు. వాడు కేసులో యిరుక్కున్నాడు. రమ్మని రాశాడు. కేసు వివరాలు వినాలి.

అందుకనీ ఒప్పుకుని పిల్లలిద్దరితో వచ్చాను. ఆ కేసు చిత్రంగా కొద్దిగా గజలక్ష్మి కేసులాగా వున్నాది. ఖర్చులు మిత్రునివే. నామనవడికి యీ వూళ్లో జాబ్ వచ్చింది. ఇంటర్వ్యూకి రమ్మన్నారు. అన్నీ కలిసి వచ్చాయని సంతోషించా. మనవడూ తోడుంటాడని సంతోషించా. పరీక్షలు ముగిసినై. పిల్లలిద్దరూ బాగానే వ్రాశామన్నారు. పేర్లు సుధ, సురస అందరి పేర్లూ యస్‌తో మొదలు కావాలిట. అందుకనలా పెట్టుకున్నారు. బ్రదర్ పేరు సురేష్. మనమడి ఇంటర్వ్యూ ముగిసింది. నమ్మకంగా జాబ్ వస్తుందన్నాడు మనమడు. వాళ్ల ముగ్గురూ ఆగ్రా వెళ్లి తాజ్‌మహల్ చూసి యింటికి చేరుతామని వెళ్లిపోయారు. మనమడు మళ్లా వచ్చి జాబ్‌లో జాయినౌతాడుట. కేసు పట్టాలా వద్దా అని వివరాలు తెలుసుకున్నాను మిత్రుడినించి. తరవాత చెప్తాలే. నీవేం పనిమీద వచ్చావీవూరు? టికెట్ రెడీయేనా? నాది రెడీయే. ట్రెయిన్ టైమ్‌కి వెళ్లచ్చు''.

''రెండో అమ్మాయి సుజాతని వూరు పంపారు. అల్లుడు పిల్లలూ వచ్చారు. సెటిల్ అయారు. రమ్మని సుజాత ఫోన్ చేసింది. వచ్చి నెల అయింది. పోతానిహ అని బయలుదేరాను. గజలక్ష్మి కేసుపోలివున్నదన్నానే మిత్రమా. నాకీ మధ్య యెందుకనో గజలక్ష్మి కళ్లకు గట్టుతున్నది. విచిత్ర మనిపించింది. చూచిరావాలనిపిస్తున్నది. ఆస్తి కోసమా? వికలత్త్వమా? పిచ్చిదని ప్రూవ్ చేసుకోవాలనా?''

''రైలు టైమైంది. గాలి పారింది. భోజనం చేసి రైలు పెట్టెలో కూచుని చెప్పుకుందాం రా''అని తీసికెళ్లాడు గౌరీనాథం.

బెర్తుల మీద స్థిరపడగానే రైలు బయలుదేరి వేగం పుంజుకున్నది. పెట్టెలోని పంకాలూ తిరిగినై స్లీపర్. కాకతాళీయంగా ఇద్దరి బెర్తులూ కిందివే అందినై. కిటికీల

దగ్గరగా యెదురెదురుగా బెర్తులమీద కూచున్నారు గారీనాథం తన యీగిల్ ఫ్లాస్క్‌నుంచి ఫ్రూట్ సాలడ్ ప్యాకెట్, ఫ్రూటీ అనే ప్యాకెట్ తీసి యిచ్చాడు.

''కొద్దిగా తిని, జూస్ తాగండి డాక్టర్. సేద దీరుతుంది. అరుగుదలా వస్తుంది'' స్ట్రా గుచ్చి అందించాడు. ''నాకూ గజలక్ష్మి గుర్తు వచ్చింది. కంటికీ గట్టింది. నాకూ చూడాలనే ఆలోచన వచ్చింది'' తన ఫ్రూట్ సాలడ్ ప్లాస్టిక్ స్పూన్‌తో తినసాగాడు గారీనాథం.

దయాసాగర్ ఫ్రూట్‌సాలడ్ తిన్నాడు. ఫ్రూటీ తాగుతూ అన్నాడు.

''చాలా సంపాయిస్తున్నట్టున్నావే గారీనాథం! ఈగిల్ ఫ్లాస్కు యీ పదార్థాలూ అంటే మిలియనీర్ అన్నమాట. తెలుపూ వచ్చింది నీకు. నాగపూర్లోనూ బాగా వదిలే వుండాలి మిత్రమా''.

''మన సొమ్ము కాదుగా, రెండు చేతులా ఖర్చు చేశా. పిల్లలు పరీక్షలు ముగించి యింటి ముఖం పట్టేదాకా ఒక టాక్సీ డ్రైవరూ హమేషా అందుబాటులో వుండేట్టు అద్దెకు తీసుకున్నా. హోటలూ పేరుమోసిందే. అన్ని సౌకర్యాలూ వుండే ఫామిలీ రూమ్. రోజుకి రెండు వేలు ఛార్జ్ చేస్తాడు. దూరదర్శన్, ఫోన్, ఫాక్స్ డైరక్టరీ బుక్, యెయిర్ కండిషన్డ్ రూమ్. బెడ్ షీట్స్ మారుస్తాడు. షవర్ ఒకటేమిటి బెల్ కొడితే ఫుట్‌బోయ్. సిస్టరిన్లాయే అన్నీ అరేంజ్ చేశానని చెప్పి పంపింది. అడ్రసులూ యిచ్చింది. రాజభోగం అంటే సరిపోతుంది'' జ్యూస్ పూర్తి అయింది. సాలడ్ అందుకున్నాడు గారీనాథం.

''తక్కిన మిత్రులకీ ఫోన్ చేసి, వస్తారా అనడిగి, వస్తామంటే అందరం కలిసి వెళ్తే బాగుంటుందని నా ఐడియా. మనమంతా కలుసుకునీ చాలా

రోజులైంది. ఫ్రూట్ సాలడ్‌లో ఆరుపండ్ల ముక్కలు కలుపుతామని యిష్టముంటే ఐస్ క్రీమ్ కలిపి తినవచ్చునీ చెప్పాడు కూల్ డ్రింక్స్ షాపు యజమాని''. రుచి అయినవీ ఫ్రెష్‌గా వున్నవీ అందితే యెనిమిది రకాలు కలుపుతాము'' అన్నాడు. '' ఐస్‌క్రీమూ వున్నది ఫ్లాస్కులో కావాలా?''

''కలుపు చూస్తా. యెనిమిది రకాలంటే?'' అనడిగాడు దయాసాగర్.

''బొప్పాయి, బత్తాయి, కమలా, ద్రాక్ష, యాపిల్, కర్బూజా, కిస్‌మిస్, వాటర్ మెలన్ ముక్కలు కలిపి ఛిల్లర్ అనే అరలో వుంచుతారట. పాడుగావు రుచీ పోదుట. ఫుడ్ పాక్‌చేసి పేపర్లో చుట్టి ఫ్లాస్కులో వుంచితే అలాగే వుంటుంది సాలడ్'' గౌరీనాథ్ ఐస్‌క్రీమ్ కలిపి తినసాగాడు. ''కేసుటూకీగా. ఆస్తికోసమే పోరాటం. రెండో పాయింట్ దత్తపుత్రుడు అన్నకొడుకే. కన్నవారికేమీ చెందటంలేదని గుర్రు మొదలు. వడుగూ, పెళ్లీ, మెకానికల్ యింజనీరింగ్, కంప్యూటరూ నేర్చాడు. మంచి జాబ్‌లో వుండగా విధి వక్రించింది. మెనింజైటిస్ వచ్చి నెలకల్లా పోయాడు. మరో యాడాది తిరిగింది. వాడి కొడుక్కి బ్రెయిన్‌లో ట్యూమర్ అని స్టేట్స్‌కి తీసికెళ్లారు. శస్త్ర చికిత్స సక్సెస్ అయింది. కాని కాన్సరు మొదటి దశలో వున్నదని నిపుణులు చెప్పారు. పదినెలల కల్లా బిడ్డా తండ్రివద్దకు పరుగెత్తుకెళ్లాడు. అంతా స్వస్థలానికి తిరిగివచ్చారు. లక్షల్లో ఖర్చయింది. మనుషులూ దక్కలేదు. యెవరి కోసమిదంతా అని వుద్యోగమూ వదిలేసిందిల్లాలు. అప్పుడు ఆత్మీయులున్నారామె వద్ద. యేమీ లేదని తెలిసి కోర్టు నాశ్రయించారు. పోయిన మనిషిస్వంత అన్న ''నా తమ్ముడు, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, యింకా కొత్త పరికరాలతో మోసెక్ టైల్స్ వ్యాపారం గూడా కలిపి పెట్టి వ్యాపార రహస్యాలు తెలియక, మేనేజ్‌మెంట్ రాక అప్పులలోకి వెళ్లి దిగులు

పడిపోయాడు. అయినకాడికవన్నీ అమ్మి నా డబ్బు గూడా కలిపి అప్పులన్నీ తీర్చేశాను. మరదలు కేమీ రాదు. అంతేగాక ఆమెని వాళ్లవాళ్లు మానసిక ఆరోగ్యకేంద్రమైన శాంతిసదనంలో అడ్మిట్ చేశారు. పెంపుడు తల్లీ ఆ ఎడ్మిషన్‌కి సహకరించింది. నాది మెత్తని మనసు గనక మిగిలిన కొద్ది డబ్బు ఫిక్సెడ్ డిపాజిట్ లో వేసి దానిమీది వడ్డీ కలెక్ట్ చేసి భరణంగా పంపుతున్నాను. మరదలు గదా. వాళ్లవాళ్లూ నా తమ్ముని దత్తు చేసుకున్న ఆమే అది చాలదని అంతా మోసమని, నెలకు కనీసం పదివేలైనా యివ్వాలని దావా వేశారు. పెంపుడు తల్లికి ఆమె భర్త యిచ్చినది ఆమె కన్నవారిచ్చినదీ నాలుగెకరాల మాగాణి వున్నది. మంచి ఫలసాయమే యిస్తుంది మాగాణి. మరదలు ఒక్కత్తెకే పదివేల ఖర్చున్నదా నెలకు. అత్యాశకు దిగారంతా. అసలేమీ పంపక్కర్లేదు. అప్పులు తీర్చటానికే చాలలేదని మనవి చేశాను'' అని జవాబిచ్చాడు.

''అంతా తవ్వి విషయసేకరణ చేస్తే, స్వంత అన్నకి తమ్ముడు పెట్టిన వ్యాపారంలో చిన్న భాగమున్నదంతే. స్వంత అన్నకి తమ్ముని వ్యాపారం అమ్మేసే హక్కులేదు. మరదలి సంతకం లేకుండా అమ్మే హక్కు అసలే లేదు. తలమునకలయే అప్పులూ లేవు తమ్మునికి. ఇంకా వింతయేమనగా ఒక దాసిని తమ్ముని పెంపుడు తల్లి వద్ద వంటమనిషిగా దాసిగా పెట్టి దాని సాయంతో పెంపుడు తల్లి శాంతమ్మ పాతకాలపు నగలు యెత్తుకొచ్చాడు. ఇప్పటి బంగారు ధర ప్రకారం ఆపాతనగలు రెండు లక్షలు చేస్తాయి. ఇంకా అద్భుతం శాంతమ్మకు చదువురాదు. సంతకం లాగా వేలి ముద్రవేయించి ఆమె భూమి దఖలు పరుచుకున్నాడు అన్న. మరదలు మానసికంగా ఆరోగ్యవంతురాలే. పరీక్ష చేయించాము. మానసిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంటే సర్టిఫై చేసింది. ఆమె పేరు జానమ్మ విక్టర్''.

''యేదో చింత పీడిస్తున్నదమ్మాయిని. చిన్న పిల్లల్ని కనిబెట్టి చూసి వారి తల్లుల కప్పగించే నర్సరీస్ వున్నాయి. అలాటిది స్థాపించి నడపమన్నా మంచిదే, లేదా అట్టి చోట జాబ్‌లో పెట్టినా పిల్లల్ని ఆడిస్తూ ఆలనా పాలనా చూస్తూ కుదుటబడుతుందమ్మాయి. పిల్లలు నెలల పిల్లలు ఆరేళ్లలోపు పిల్లలైతే త్వరగా తేరుకుంటుంది'' అని ధైర్యం చెప్పి పంపింది. అదంతా నేను సర్దుబాటు దిద్దుబాటు చేయగలిగి, కోర్టుద్వారా గెలిపించితే, నాకు పెద్ద మొత్తమే అందుతుంది ఖర్చులు కాక''.

'' ఇంత దూరానెందుకున్నది నీ క్లయంట్? ఆంధ్రాకాదా?'' రైలు లయబద్ధంగా పోతూ వూయల వూపుతున్నట్టున్నది. దయాసాగర్ అన్నీ సర్దిపెట్టాడు.

''భర్త నమ్మకస్తులైన మరో ముగ్గురితో కలిసి పెట్టి వ్యాపారంలో భాగస్వామి అయాడు. తనవంతు భాగం భార్యపేర పెట్టాడు. ఆమెను సంప్రదించే వ్యాపారం పెట్టాడు. వ్యాపారానికి తన నగలమ్మి పెట్టమని అన్నీ యిచ్చేసింది నా క్లయంటు'' గౌరీనాథం ఆవలించి మేను వాల్చాడు. దయాసాగరూ మేనువాలుస్తూ అన్నాడు. ''వయస్సూ ముదిరింది గౌరీనాథం. ప్రయాణాలు చేయలేమేమో. అందర్నీ కూడగట్టుకునే వెళ్దాం. ''బెడ్డింగ్ పరిచి పడుకున్నాడు దయాసాగర్.

''అలాగే. నే చూస్తాగా ఆ సంగతీ'' తానూ పడుకున్నాడు గౌరీనాథం.

12

సంగీతలహరి వినవస్తుందని ఆశిస్తూ లోపలికడుగిడిన మిత్రబృందం నిలబడిపోయారు. హాలులో ఒక మూలగా చాపమీద ముడుచుకుని పడుచుకుని

సన్నగా రోదిస్తున్నది కమలమ్మ.

గోడకు గజలక్ష్మి ముఖచిత్రం వేలాడుతున్నది. దానికి తాజా పూలదండ అలంకారం. కింద నేలమీద రెండు వాజుల్లో వూదొత్తులు సుగంధ పొగ వదులుతున్నాయి.

నాగేంద్ర వీరిని చూసి లేచి నిలబడి ''దివికేగింది గజలక్ష్మి'' అన్నాడు.

''యెన్నాళ్లైందీ?'' దయాసాగర్ అడిగాడు.

'' ఇవాళ పదకొండో రోజు. నేటినించే పెద్దకర్మ దానధర్మాలు ఆరంభిస్తాము'' అన్నాడు. స్నానం చేసిన తల బుజం మీద తడి అంగవస్త్రం. పొడి దోవతీ తాకుతూ సన్నని జంధ్యం బుజం మీదిగా కదుల్తున్నది.

''యే వ్యాధి తీసుకుపోయింది గజలక్ష్మిని'' గౌరీనాథం అడిగాడు.

కమలమ్మ లేచికూచుని కళ్లువిప్పి వీరిని చూసి భోరుమన్నది. మొహాన చేతులుంచుకుని

''అమ్మా!గజలక్ష్మీ! నిన్ను చూడాలని డాక్టర్లూ లాయరుగారూ వచ్చారు. రామ్మా!'' అని ''అలా కూచోండి కుర్చీల్లో. గజలక్ష్మికా? జబ్బేం లేదు. బలాఢ్యురాలుగదూ. హరాయించుకునే శక్తీ వున్నది. వడదెబ్బ కొట్టింది. అతిసారం తాకింది డాక్టరు గారూ. యెండలు మండి పోతున్నై. రోహిణీ కార్తె రోహిణికి రోళ్లు పగులుతై అని సామెత. బయటికి పోవోకు అంటే విన్నది గాదు. మంచి బకెట్ స్టీల్‌ది కొన్నది. సబ్బేసి కడిగింది. తళతళా మెరిసింది. ఆనాడు కొళాయి రాలేదు. దొడ్లో బావి వున్నది. కాని చాలా లోతు. మా అబ్బాయి

నీళ్లు తోడి తెచ్చి వంట చేశాడు. నేను అవన్నీ చేయలేకపోతున్నా. మధ్యాహ్నం మండుటెండలో ఆ కొత్త బకెట్ పట్టుకుని నవ్వుతూ యెదురుగా వున్న శంకరమఠంలో బోరింగ్ పంపునీళ్లు తెస్తానని వెళ్లింది. బోరింగ్ పంపునించీ రావేమో నీళ్లివాళ అంటుంటే వినిపించుకోకుండా వెళ్లింది. మంచినీళ్లేమో తెచ్చింది. నవ్వుతూనే వచ్చింది. వడగాలు యీడ్చి కొట్టింది. జుట్టంతా రేగింది. ''మఠంలో వున్నవాళ్లే బకెట్ నింపారు. నేను పంపు కొట్టనేలేదు'' అని బకెట్ నేల మీదుంచి అక్కడే వున్న మంచం మీద వాలింది గజలక్ష్మి. వళ్లు సలసల కాగిపోయింది. మంచి నీళ్లు తాగించాము. తడితువాలు పిండి తడిగుడ్డతో వళ్లంతా తుడిచాడబ్బాయి. రక్తం నీరైందేమో. చెమటలు కుమ్మరించినై. అబ్బాయి తుడుస్తూనే వున్నాడు''.

''ఐస్ వాటర్ బకెట్‌తో ఒంటిమీద బలంగా పోయాలి. రక్తంనించి నీరు విడిబడుతుంది హీట్‌స్ట్రోక్ లాగానే'' అన్నాడు మౌళి.

''గుండె నీరు వదులుతుంది. తట్టుకోలేదు. పోనీ ఐస్‌వాడలేదూ''.

''ఇన్సులిన్ వుప్పు నీరూ యెక్కించాలి. దగ్గర్లో హాస్పిటల్ లేదూ? అడ్మిట్ చేయకపోయారా? పోనీ ప్రైవేట్ ప్రాక్టీషనర్ని పిలుచుకు రాలేదూ?''.

''పిలుచుకొచ్చాం డాక్టరు గారూ! కొంత తట్టుకున్నదేమో కళ్లు విప్పి డాక్టర్ని చూసింది. తెరిపి మరుపులొచ్చివుండాలి''.

''అమ్మా! డాక్టర్ని పిలుచుకొచ్చావే? బతికించాలనా? బతికి యేం చేయాలి. నాకు నేను పనికిరాను. మీకు పనికిరాను. ఆ డాక్టరుకి ఫీజిచ్చి పంపేయండి'' అన్నది. కళ్లు మూతలు పడినై.

''డాక్టరు వెళ్లిపోయాడు. ఆనాడల్లా అబ్బాయి తడిగుడ్డతో తుడుస్తూనే వున్నాడు. రాత్రికి తగ్గినట్టే, తట్టుకున్నట్టే కనిపించింది. మంచి చీరా రవికా ధరించింది. కటిక నేలమీద కూచున్నది నా తల్లి. జుట్టు నేలకి తాకుతున్నది. నీటి చుక్కలు పడుతూ పాకుతున్నాయి నేలమీద''.

''అమ్మా! ఆకలేస్తున్నది. తినడానికేమైనా పెడ్తావా? పిచ్చెత్తింది. పిచ్చెత్తింది అని అరుస్తూ వీధిన బడతావా?'' అని నవ్వింది నా బిడ్డ. నించుని వున్న అన్నను చూసింది.

''అన్నయ్యా! అలా చూస్తున్నావేం? పెళ్లాడక మంచిపని చేశావు సుమా. ఆ పెళ్లాం పిల్లల్ని గని చచ్చి, ఆ పిల్లల్ని సాకమని నీ యెదాన పడేసి పోయేదేమో. నేపనికిరాకుండా అయిపోయినా నైపాయె. అన్నయ్యా! నాకు అరవై నిండినయ్యా పోనా? ఇంకా వుండాలా? నూరేళ్లు నిండనిదీ పోనా? ఇంకా చాలా యేళ్లున్నాయే'' అని నవ్వింది గజలక్ష్మి.

కాఫీ పలహారం చేసి యెదురుగా పెట్టాను. నింపాదిగా అన్నీ పూర్తి చేసింది. నా వంక చూస్తూ నవ్వింది ''పాపం నీకెంత కష్టదశ. నేనే నీకన్నీ చేయాలి. తారుమారైంది'' అన్నది.

అబ్బాయి ఆశ్చర్యపోయాడు ''చావు తెలివేమో!'' అని వినపడకుండా గొణుగుతూ వీధిలో కెళ్లాడు. నేను వంటింట్లో కెళ్లి మళ్లా వచ్చి చూస్తే యెదురుగా వున్న ప్లేటూ గ్లాసూ పక్కనే వొరిగి పడివున్నది గజలక్ష్మి. వైద్యుడిని పిలుచుకొచ్చాడబ్బాయి.

నాడి చూసి పెదిమలు విరిచి ''అయిపోయింది. వెళ్లిపోయింది గజలక్ష్మి''

అన్నాడు వైద్యుడు. ఇరుగుపొరుగు వచ్చారు. ఋణం తీర్చుకుని ఋణం తీరి వెళ్లిపోయింది అన్నారు'' మరోసారి భోరుమన్నది.

'' ఆనాడే కళ్లకు గట్టి వుండాలి అందరికీ'' అనుకున్నారు వచ్చినవారు. మరోసారి గోడవంక చూస్తే గజలక్ష్మి సుందరవదనారవిందం నవ్వుతూ కనిపించింది. ఆ నవ్వు ముఖం కట్టివేయగా తిరిగి వెంటనే వెళ్లలేక పోయారు. తామూ బంధువులలాగే కర్మలలో పాల్గొని సాయపడ్డారు. డబ్బు మంచినీళ్లలాగా వాడారు. అన్నదానం చేయించారు. తామూ వడ్డనలో పాల్గొన్నారు. తెలిసిన వారూ వచ్చారు. వారూ సాయపడ్డారు. పక్కింటి అబ్బాయి రామమోహన్‌కి గజలక్ష్మికి ఒకవిధంగా సహాధ్యాయీ, మిత్రుడూ. ఇద్దరూ కంప్యూటర్ క్లాసెస్‌లో పాల్గొన్నారు. ప్రైవేట్‌గా వ్రాసిన పరీక్షల్లో పాల్గొన్నారు. అతను సాఫ్ట్‌వేర్ బిజినెస్ స్టార్ట్ చేసి ఒక యాడాదైంది. గజలక్ష్మి యింటికి వచ్చి అందర్నీ పలకరించి వెళ్తూ వుండేవాడు.

అతనుత్సాహంతో అన్నీ అరేంజ్ చేసి షామియానా వేయించి దానికింద అన్నీ అరేంజ్ చేసి వీడియో ఫిల్మ్ చూపించాడు మూడు రోజులూ. రికార్డింగ్ మెషీన్ పెట్టి గజలక్ష్మి పాడిన పాటలూ, ఆటలూ, జంత్రీ వాయిద్యాలూ, ఫ్లూట్ వినిపించాడు.

ఇటూ అటూ తిరుగుతూ సాయపడుతూ సర్వ్ చేస్తూ, అతిధులనాహ్వానిస్తూ, సాగనంపుతూ డాక్టర్లూ లాయరూ ఆనందించారు. ఫిల్మ్ చూచారు. సంగీతం విన్నారు. గజలక్ష్మి తమ మధ్య, షామియానా కిందా తిరుగుతున్నట్టు నవ్వుతున్నట్టు బావించారు. బాగా తలపుకి వచ్చింది.

''జీవా! మాయాకాయమురా । మమతలలోబడి చెడితివి గదరా ।''

హార్మోనియం మీద రెండు చేతులతో వాయిస్తూ, ''అపురూప దర్శనంబాయెనహో నేడూ । ఉన్నదా నా మీద ఉల్లమున దయ నీకు ఉన్నాను నీ దయ పన్నగ శయనా॥ అని పాడుతూ కనిపించింది.

అందంగా నిలబడి వయ్యారం, హొయలు చూపుతూ జవ్వనిలాగా అభినయం పడుతూ తిరిగింది. ''ఇందెందు వచ్చితిరా। ఇది నీ వీధిగాదు పోపోరా। మందర గిరధరమా మువ్వగోపాలా । మచ్చె కంటిని జేరి మైమరిచినావో। గుచ్చి కౌగలించుకో నెచ్చెలినేగాను. ఇందెందు వచ్చితిని.

దొంతరలిడెముతోను చెంతకురాకు నీకు నాయనా అని బెదిరిస్తూ నవ్వింది.

బెడ్ రూమ్‌లో డాక్టర్ నాగలక్ష్మి టైరై మంచం బెడ్‌కంటబడితే దానిమీద వాలింది. గజలక్ష్మి అంటున్నట్టు వినబడింది.

''మమ్మీ! దొంగయేడుపులేడవకు. భగవంతుడు మెచ్చడు. డబ్బు రాలేదాకా దూషించి, అది రాలి కంటబడితే నీ మనసు పాలుపొంగినట్టు పొంగేది. కళ్లు వెలిగేవి'' గజలక్ష్మి లేచి పుస్తకాల షెల్ఫు కంటబడితే దగ్గర కెళ్లి సర్దుతుండగా డైరీ కిందబడింది. తీసి పేజీలు తిప్పింది. గజలక్ష్మి వ్రాసుకున్న లైన్లు కంటబడినాయి.

''మనస్సు వికలమైంది. అసూయాద్వేషాలు నన్ను తమ యిష్టం వచ్చినట్టు ఆడించాయి. దైవం గుర్తు రాలేదు. దైవాన్ని నమ్ముకోవాలని మరిచాను. అదే

పొరపాటు. ఓనాడెత్తుకుని ముద్దుచేసిన సిస్టర్ని ద్వేషించాను. నా వెంటబడి దాసుడు కావాల్సిన మనిషి కురూపి వెంటబడ్డాడనుకుని విడదీయాలని చూశాను. కాని మందులవల్ల వైకల్యం కంట్రోల్ అయినప్పుడు, సిస్టర్ని ప్రేమగా చూస్తూ అన్నీ చేసిపెడుతూ కొనిబెడుతూ దాని యిష్టత మీదే, దాని ద్వారానే వాడినీ స్వాధీనం చేసుకోవటం తెలివైన పద్ధతి అనిపించేది. కాని ఇగో పెరిగి దయ్యమై నన్ను పట్టేది. తిక్కరేగేది. దీని నాశ్రయించాలా? దీనితో మంచిగా వుండాలా? నేనే లొంగదీయగలను. దీనికి పైసాలేదు. డిగ్రీ లేదు. జాబ్ లేదు యేమిటి దీని గొప్ప అనిపించి దుర్భాషలాడి బాగా యేడిపించేదాన్ని. కథలల్లాను. వాడితో యెప్పటినించో సంబంధమున్నదనేదాన్ని. చుప్పనాతీ, శూర్పణఖా, కళ్లల్లో నిప్పులు పోసుకుని విడదీశావు అని గొంతుపట్టుకుంటే విడదీశారు. ఇంట్లోనించి పొమ్మన్నా. గతిలేనిదానా దిక్కు మొక్కు లేనిదానా అని వీధిలోకి గెంటేశా. అలా నాకు నేనే హాని చేసుకున్నా. సిస్టర్‌కి దూరమైనా. ఇగో కచ్చలోకి నడిచింది. అధున్న చోటుకెళ్లి ''పచ్చి మంచినీళ్లివ్వదు. పిల్లల్ని చూడనివ్వదు'' అని ప్రాపగండా చేశా. చుట్టపట్ల అప్పులు చేసి అన్నీ కొనుక్కు తిని ''నా ముద్దుల చెల్లెలు తీరుస్తుంది'' అని నమ్మబలికాను. నా ముఖవర్ఛస్సు చూసి నమ్మారు. నెగెటివిజం పెరిగింది. పాజిటివిజం లేదు. డిగ్రీలు కొట్టి పెద్ద వుద్యోగస్తురాలినై, ధనార్జన చేయాలని ఆలోచన కాని మనసు పరిపరివిధాల పోయేది. వీళ్లందర్నీ నేనెందుకు మేపాలి. వీళ్లంతా సోమరులై నా దగ్గర చేరి నన్ను వంచిస్తూ పైకి ప్రేమ నటిస్తున్నారని పించేది. మరోసారి విచిత్రంగా అంతా చనిపోయి దయ్యాలైపైకొచ్చి నన్ను పీక్కుతింటున్నారనిపించేది. అంతలోనే నిజం గుర్తు వచ్చి బాగా నవ్వు వచ్చేది. అందరితో రాజీ పడదామనిపించేది''.

''సంతోషంగా యిచ్చింది తీసుకో. వంచించకు. నా సొమ్ము లాగకు'' అని చెపితే వారికి నచ్చక వికటంగా నవ్వేవారు. మరోసారి మా గ్రామంలో నా భర్త యింట్లోనే వుండి, జీతగాళ్లు, కమతగాళ్లూ, పాలేరులు, రైతులు, కూలి అమ్మాయిలు అంతా గౌరవంగా చూస్తుంటే వుండక, వదిలి యెందుకు పట్నవాసం కావాలనుకున్నాను. భూమాతను నమ్ముకుంటే బాగుండేది. దేనికొచ్చిన చదువూ సంగీతం. ''అమ్మగోరూ, దొరసానీ!'' అని పిలిచేవారు. దణ్ణాలు పెట్టేవారు. కమ్మని భోజనం నూకల నెయ్యి మీగడ పెరుగూ యేవీ? రేషన్ బియ్యం, యేదో రంగు రుచీ వాసన లేని నూనె. నువ్వు అని పిలిచే పనివారు''. రామకృష్ణ పరమహంస నరేంద్రుడనే యువకునితో అన్నాడు.

''నిన్ను చూస్తున్నంత స్పష్టంగా దైవాన్ని చూచాను. నీకూ చూపగలను. ''త్యాగరాజస్వామి ననుపాలింపా నడచి వచ్చితివో అని చూచాడు రాముని. భవనుతానా హృదయమున రమింపు అని పాడాడు. తనకుతానే హాని కుంటామనే యింగితముండాలని పాడాడు. బసోమేరే నైనమే నందలాల్ అని మీరాబాయి కృష్ణుని చూచేది. కబీర్‌దాస్ మైగులామ్ తేరె అని పాడి రాముని చూచాడు. చూపించాడితురులకి. వైష్ణవజనతో తెనె కహియే జోపీడ పరాయీ ఆహెరేరోయీ! పరదుఃఖే వుపకారాకరే కోయీమన్ అబిమాన్ జాణెరె కోయీ వైష్టవజనతో అని నర్సిమెహతా పాడాడు. వారంతా చిరంజీవులైతే నేను జీవన్మృతురాలనైనాను'' అని తన్మయత్త్వంతో నిలబడే చదువుతున్నది నాగలక్ష్మి.

మిత్రులులోపలి కొచ్చారు. ''యేమిటంత యేకాగ్రతతో చదువుతున్నారు డాక్టర్. మనం వెళ్లాలి. కర్మలు పూర్తి అయినై. మనం ప్లేన్ అందుకోవాలి. కమాన్. పెట్టె బెడ్డింగ్ సద్దేశాం. కారొచ్చింది'' అన్నారు.

నాగలక్ష్మి నవ్వటానికి ప్రయత్నిస్తూ వెలవెలపోతూ ఆ డైరీ వారి కందించింది.

''పోదం రండి'' అన్నది. వాళ్లు వెళ్లిపోతూ వెనక్కి చూస్తే స్క్రీన్ మీద గజలక్ష్మి చిన్నపిల్లలాగా ఆడుతున్నది. అచ్చనగాయలాడుతున్నది. ఒప్పులకుప్ప తిరుగుతున్నది.

❋ ❋ ❋ ❋ ❋